


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

# అక్షర రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం

తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAMUDHRA

RNI No: TELTEL/2024/86684



**విలేకరులు కావలెను**

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575



| మేడ్చల్-మల్కాజ్‌గిరి | శుక్రవారం | 03.07.2026 | సంపుటి: 3 | సంచిక: 151 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | FRIDAY | 03.07.2026 | VOLUME : 3 | ISSUE : 151 | PAGES: 8 | COST: 2/- |




## అల్పాహారంతో పాటు మధ్యాహ్న భోజనం

స్కూళ్లు, జూనియర్ కాలేజీల్లో ఉపాధ్యాయులు, సిబ్బందికి కూడా

వీబీజీ పథకంపై సుప్రీం కోర్టుకు

టిమ్స్ లో భారీ ఎత్తున ఉద్యోగ నియామకాలు

మూసీ ఫేజ్1 అభివృద్ధి కోసం రూ.7,345 కోట్లు మంజూరు

మంత్రిమండలి నిర్ణయాలు



2

## బీఆర్ఎస్ గూండాగిరికి భయపడేది లేదు

- భవిష్యత్తులో ప్రతిపక్ష హోదా కూడా దక్కదు
- చర్చలకు మంత్రులు వస్తే పారిపోయింది వారే
- రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి



2




## తొడగొట్టి తోకముడిచిన మంత్రులు

- మూడు గంటలు వేచి ఉన్నా అడ్రస్ లేని జూపల్లి
- మేం గన్ పార్కుకు వెళ్లకుండా నాటకాలు ఆడారు
- హరీష్‌రావు, ఇతర నేతల్ని అరెస్టు చేయడం సిగ్గుమాలిన చర్య
- ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు పెట్టండి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్, జూలై 2 (రాజముద్ర న్యూస్):** అప్పులపై చర్చకు సిద్ధమని సవాళ్లు విసిరిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన మంత్రులు తీరా సమయం వచ్చేసరికి తోకముడిచి పారిపోయారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. సవాల్ విసిరి చేతకాక పారిపోయిన ఈ సన్నాసుల బాగోతాన్ని ఇవాళ రాష్ట్ర ప్రజలంతా కళ్లారా చూశారని మండిపడ్డారు. తానే స్వయంగా తెలంగాణ భవన్‌కు వస్తున్నానని ప్రగల్భాలు

మిగతా 2వ పేజీలో..

## సెల్ఫ్ గోల్ కొట్టిన ప్రభుత్వం

- మాట తప్పిన జూపల్లి రాజీనామా చేయాలి
- ఫోన్ చేస్తే మంత్రులు సమాధానం చెప్పలేదు
- ఒక శాఖపై మరో శాఖ కోర్టుకు వెళ్లే దుస్థితి
- మాజీ మంత్రి హరీష్‌రావు

3




# గన్‌పార్క్ వేదికగా కాంగ్రెస్ - బీఆర్ఎస్ రాజకీయ పోరు



- రాష్ట్ర అప్పులపై బహిరంగ చర్చకు సవాళ్లు, ప్రతి సవాళ్లు
- తెలంగాణ భవన్ నుంచి బయల్దేరిన హరీశ్‌రావును అడ్డుకున్న పోలీసులు
- తోపులాట.. హరీశ్‌రావు సహ బీఆర్ఎస్ నేతల అరెస్ట్
- తెలంగాణ భవన్‌లో జూపల్లి కోసం ప్రత్యేక కుర్చీ ఏర్పాటు

**హైదరాబాద్, జూలై 2(రాజముద్ర న్యూస్):** తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రాజకీయ పోరు మరింత వేడెక్కింది. రాష్ట్ర అప్పులు, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన ఆర్థిక వ్యవహారాలు, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో ఇరు పార్టీల మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లు కొనసాగుతున్నాయి. ఈ వివాదం గన్‌పార్క్ కేంద్రంగా మారడంతో రాజకీయ వాతావరణం ఉద్రిక్తంగా మారింది.
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు తెలంగాణ భవన్‌లో పార్టీ నేతలతో సమావేశమయ్యారు. రాష్ట్ర అప్పులపై కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలకు పూర్తి ఆధారాలతో సమాధానం చెబుతామని, ప్రజల సమక్షంలో బహిరంగ చర్చకు సిద్ధమని వారు ప్రకటించారు.

**జూపల్లి సవాల్..**

మంత్రి జూపల్లి కృష్ణారావు కూడా బీఆర్ఎస్ నేతలకు గట్టి సవాల్ విసిరారు. బీఆర్ఎస్ పాలనలో రూ.7 లక్షల కోట్లకు పైగా అప్పులు చేశారనే విషయాన్ని ఇప్పటికే ఆధారాలతో వెల్లడించానని

మిగతా 3వ పేజీలో..

## బీఆర్ఎస్ చేసిన అప్పులపై చర్చకు సిద్ధమే

- ఇంత జరుగుతున్నా ఆర్ ఎందుకు మాట్లాడరు
- మండిపడ్డ మంత్రి జూపల్లి



2

## 'క్యూర్'లో ఇందిరమ్మ ఇళ్లకు త్వరలో టెండర్లు

- తుది దశలో స్థలాల సేకరణ
- దశలవారీగా ప్రతీ పేద కుటుంబానికి సొంత ఇల్లు
- 19 నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్టుగా వెయ్యి ఇళ్ల నిర్మాణం
- రెవెన్యూ మంత్రి పొంగులేటి

2







## ఖమ్మంలో ఖాకీ కుంభకోణం..

- పోలీసులే దోపిడీ ముఠా..
- గంగారం డెకాయిటీ కేసును ఛేదించిన పోలీసులు
- ముఠాలో ఇద్దరు పోలీసుల పాత్ర వెలుగులోకి
- 12 మంది అరెస్ట్..
- రూ.17.60 లక్షల నగదు స్వాధీనం
- మరో ఇద్దరు నిందితుల కోసం గాలింపు కొనసాగింపు

2



## గురుకులాల టెండర్ల అవినీతిపై చర్చకు సిద్ధం

- ఎన్నికైన ప్రజాప్రతినిధులతోనే చర్చిస్తాం
- కేసీఆర్ లాగా కడప కాంట్రాక్టర్లకు టెండర్లు ఇవ్వలేదు
- ఆరఎస్ విమర్శలపై మంత్రి పొన్నం ప్రతి విమర్శలు

3





## స్పీడ్ పోస్ట్ ద్వారా పార్సిళ్లలో గంజాయి

- స్మగ్లర్ల కొత్త ఎత్తులు
- హైదరాబాద్ పోలీసుల ఆపరేషన్‌లో గుర్తింపు
- వివరాలు వెల్లడించిన నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్

2

## పోలీస్ శాఖ కీలక నిర్ణయం

- మాజీ డీజీపీలకు బుల్లెట్‌ప్రూఫ్ వాహనాల తొలగింపు
- భారీగా భద్రత కూడా తగ్గిస్తూ ఆదేశాలు

3




## 2వేల అదనపు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి

- సీఎంను కోరిన ఆదివాసీ, గిరిజన ఎమ్మెల్యేలు

2



## సీఐడీ డీఎస్పీ భీంరెడ్డి ఆస్తులపై ఏసీబీ దృష్టి

- సోదాల్లో డైరీ స్వాధీనం.. 15 మంది బినామీల వివరాల గుర్తింపు
- రూ.200 కోట్ల విలువైన ఆస్తుల ఆనవాళ్లు.. కేజీ బంగారం, నగదు స్వాధీనం




2

# సీఐడీ డీఎస్పీ భీంరెడ్డి ఆస్తులపై ఏసీబీ దృష్టి

- సోదాల్లో డైరీ స్వాధీనం.. 15 మంది బినామీల వివరాల గుర్తింపు
- రూ.200 కోట్ల విలువైన ఆస్తుల ఆనవాళ్లు.. కేజీ బంగారం, నగదు స్వాధీనం
- మరో రెండు రోజుల పాటు కొనసాగనున్న తనిఖీలు

**హైదరాబాద్, జూలై 2(రాజముద్ర న్యూస్):**

సీఐడీ డీఎస్పీ భీంరెడ్డి నివాసంతో పాటు పలు ప్రాంతాల్లో అవినీతి నిరోధక శాఖ అధికారులు నిర్వహిస్తున్న సోదాల్లో కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. తనిఖీల సందర్భంగా భీంరెడ్డి నివాసంలో ఓ డైరీని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అందులో 15 మంది బినామీల పేర్లు నమోదై ఉన్నట్లు గుర్తించినట్లు సమాచారం. ఇప్పటివరకు జరిగిన సోదాల్లో సుమారు రూ.200 కోట్ల విలువైన ఆస్తుల ఆనవాళ్లను అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది.

హైదరాబాద్‌తో పాటు మొత్తం 16 ప్రాంతాల్లో భీంరెడ్డికి చెందిన ఆస్తులను అధికారులు గుర్తించినట్లు సమాచారం. సోదాల్లో కేజీ బంగారం, రూ.40 లక్షల నగదును స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. మిగిలిన ఆస్తులకు సంబంధించిన పత్రాలు, ఆర్థిక లావాదేవీలపై కూడా అధికారులు పరిశీలన కొనసాగిస్తున్నారు.

**విస్తృతంగా దర్యాప్తు**

భీంరెడ్డి 1995లో ఎస్సైగా పోలీసు శాఖలో ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. అనంతరం సీఐగా పదోన్నతి పొంది రాయదుర్గం, వనస్థలిపురం, చిక్కడపల్లి పోలీస్ స్టేషన్లలో పనిచేశారు. తర్వాత డీఎస్పీగా పదోన్నతి పొందిన ఆయన పటాన్‌చెరు డివిజన్‌లో విధులు నిర్వహించారు. ప్రస్తుతం సీఐడీ డీఎస్పీగా పనిచేస్తున్నారు.

**రెండు రోజుల పాటు సోదాలు**

భీంరెడ్డిపై గతంలోనే అక్రమాస్తులు కూడబెట్టారనే ఆరోపణలు ఉన్న నేపథ్యంలో ఏసీబీ అధికారులు విస్తృతంగా సోదాలు నిర్వహిస్తున్నారు. ఆస్తులకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తూ పత్రాలను పరిశీలిస్తున్నారు. మరో రెండు రోజుల పాటు తనిఖీలు కొనసాగనున్నట్లు సమాచారం. అధికారులు సేకరిస్తున్న ఆధారాల ఆధారంగా తదుపరి చర్యలు చేపట్టే అవకాశం ఉంది.

# ఖమ్మంలో ఖాకీ కుంభకోణం..

**ఖమ్మం, జూలై2(రాజముద్ర న్యూస్):**

ఖమ్మం జిల్లా సత్తుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని గంగారం గ్రామంలో జరిగిన డెకాయిటీ కేసును పోలీసులు ఛేదించారు. కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలు దర్యాప్తు చేపట్టి 12 మంది నిందితులను అరెస్ట్ చేశాయి. ఈ ముఠాలో విధుల్లో ఉన్న ఇద్దరు పోలీసు సిబ్బంది కూడా ఉండటం రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. అరెస్టైన వారిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించగా, మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

**యూనిఫాం చాటున నేరాలకు పాల్పడి..**

ఈ కేసులో టీజీఎస్పీ 15వ బెటాలియన్‌కు చెందిన కానిస్టేబుల్ ముళ్లగిరి వర్ధన్, ఆర్ఎస్ఐ ఖుశీ బేరా కేశవరావు కీలక పాత్ర పోషించినట్లు దర్యాప్తులో తేలింది. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసు సిబ్బందే నేర ముఠాతో చేతులు కలిపి దోపిడీలకు పాల్పడటం తీవ్ర చర్చకు దారితీసింది. బ్లాక్ మనీని వైట్ మనీగా మారుస్తామని నమ్మబలికి, రూ.10 లక్షలు ఇస్తే రూ.40 లక్షలు ఇస్తామని ఆశ చూపిస్తూ బాధితులను మోసం చేసినట్లు పోలీసులు గుర్తించారు.

**పోలీసుల్లా నటించి దోపిడీ**

నగదు మార్పిడి పేరుతో బాధితులను ముందుగా నిర్ణయించిన ప్రాంతానికి రప్పించిన ముఠా, అక్కడ పోలీసు యూనిఫాంలు, పోలీసు టీషర్టులు, రైన్‌కోట్లు ధరించి హ్యాండ్‌కఫ్‌లతో దాడికి దిగేది. చట్టపరమైన చర్యలు తీసుకుంటామని బెదిరించి బాధితుల వద్ద ఉన్న అసలు నగదును లాక్కొని వాహనాల్లో పరారయ్యేవారు. తమ వద్ద ఉన్న నగదు నిజమైనదేననే నమ్మకం కల్పించేందుకు పిల్లలు ఆడుకునే రూ.500 డమ్మీ కరెన్సీ నోట్లను బండిళ్లుగా తయారు చేసి ఉపయోగించినట్లు విచారణలో వెల్లడైంది.

**భారీగా నగదు, వాహనాల స్వాధీనం**

నిందితుల నుంచి రూ.17.60 లక్షల నగదు, రెండు ఇన్నోవా కార్లు, ఒక ఎర్టిగా కారు, ఒక టీవీఎస్ యాక్సెస్ ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నారు. అలాగే 16 సెల్‌ఫోన్లు, పోలీసు యూనిఫాంలు, హ్యాండ్‌కఫ్‌లు, రైన్‌కోట్లు, రూ.500 డమ్మీ కరెన్సీ నోట్లకు చెందిన 80 బండిళ్లను కూడా స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

గంగారం డెకాయిటీ కేసులో పరారీలో ఉన్న మరో ఇద్దరు నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయని కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ వెల్లడించారు. కేసుకు సంబంధించిన అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు.




# ‘క్యూర్’లో ఇందిరమ్మ ఇళ్లకు త్వరలో టెండర్లు

**హైదరాబాద్, జూలై 2(రాజముద్ర న్యూస్):**

క్యూర్ పరిధిలోని ఇన్నర్ రింగ్ రోడ్ ప్రాంతంలో లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే టెండర్లు పిలవనుందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మూడు కార్పొరేషన్ల పరిధిలో లక్ష ఇళ్ల నిర్మాణానికి అవసరమైన స్థల సేకరణ మరో రెండు నుంచి మూడు రోజుల్లో పూర్తి చేయనున్నట్లు తెలిపారు. గోషామహల్ నియోజకవర్గంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు సంబంధించిన పట్టాలను సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజారుద్దీన్, అడ్లూరి లక్ష్మణ్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, స్థానికఎమ్మెల్యే రాజాసింగ్ తదితరులతో కలిసి మంత్రి పొంగులేటి లబ్ధిదారులకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాల మాదిరిగా కాక కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి పేద కుటుంబానికి ఇల్లు అనే లక్ష్యంతో ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. క్యూర్ పరిధిలోని 19 నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్టు కింద ఒక్కోచోట కనీసం 500 నుంచి 1000 ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. అనంతరం రెండో, మూడో విడతల్లో మరిన్ని ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే ఒక్కో నియోజకవర్గానికి 5500 వరకు ఇళ్లు కేటాయించిన విషయాన్ని గుర్తు చేస్తూ పట్టణ ప్రాంతాల్లో భూమి విలువ ఎకరాకు రూ.100 నుంచి రూ.200 కోట్ల వరకు ఉన్నా కూడా ఆ భూముల విలువను పక్కనబెట్టి పేదలకు అదే ప్రాంతంలో ఇళ్లు నిర్మించి వారి పేరిట పట్టాలు ఇస్తామని మంత్రి తెలిపారు. ధూల్‌పేట ప్రాంతంలో గత ప్రభుత్వ కాలంలో అసంపూర్తిగా నిలిచిపోయిన 125 ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి అందిస్తున్నామని, మిగిలిన పేదలకు కూడా ఇళ్లు మంజూరు చేసేలా పరిసర ప్రాంతాల్లో స్థలాలను గుర్తించేందుకు కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఈ విషయంలో ఎవరూ నిరాశ చెందాల్సిన అవసరం లేదని మంత్రి పొంగులేటి భరోసా ఇచ్చారు.

# తొడగొట్టి తోకముడిచిన మంత్రులు

**మొదటిపేజీ తరువాయి**



పలికిన మంత్రి జూపల్లి కృష్ణారావు కోసం ప్రత్యేకంగా కుర్చీ వేసి శాలువాతో మూడు గంటలపాటు వేచి చూసినా రాలేదన్నారు. మంత్రి రాకుండా మొహం చాటేయడంతోపాటు మరో చోట డ్రామాకు తెరలేపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరికి గన్ పార్క్ వద్ద చర్చకు సిద్ధమై బయలుదేరిన హరీశ్ రావును ఇతర నేతల్ని అరెస్టు చేయడం, తమను అడుగడుగునా అడ్డుకోవడం సిగ్గుచేటు అని కేటీఆర్ ఫైర్ అయ్యారు. అక్కడ కూర్చుని మంత్రులు సవాళ్లు విసరడం, ఇక్కడ పోలీసులను పెట్టి అడ్డుకోవడం ఈ ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. కంచన్ బాగ్ పోలీస్ స్టేషన్‌లో కు తరలించిన నేతలను పరామర్శించేందుకు కూడా వెళ్లనీయకుండా అడ్డుకోవడం దుర్మార్గమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రికి, మంత్రులకు నిజంగానే చర్చించే దమ్ముంటే వెంటనే ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయాలని కేటీఆర్ సవాల్ విసిరారు. సభలో మైక్ కట్ చేయకుండా తమకు మాట్లాడే అవకాశం ఇస్తే ఈ ప్రభుత్వ రెండున్నరేళ్ల డొల్లతనాన్ని, అవినీతి బండారాన్ని మొత్తం బట్టబయలు చేస్తామని స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన అబద్ధపు హామీలు, పరిపాలనా వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు ప్రభుత్వం నిత్యం ప్రయత్నిస్తోందని, ఇలాంటి శిఖండి రాజకీయాలను ప్రజలు సహించరని హెచ్చరించారు. రెండున్నరేళ్లలో అనుముల బ్రదర్స్ రాష్ట్రాన్ని నిలువునా దోచుకుంటున్నారని, అదానీని మించిన ఆస్తులు కూడబట్టారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో ప్రస్తుతం సాగుతున్నది ప్రజా పాలన కాదని, రాక్షస పాలన అని కేటీఆర్ విమర్శించారు. ఎక్సైజ్ శాఖలో హోలోగ్రామ్ టెండర్లలో మంత్రి కొడుకు, సీఎం అల్లుడి పంచాయతీ భరించలేకే ఐఏఎస్ అధికారి రిజ్వీ రాజీనామా చేశారని, బీర్ల కోసం తెచ్చిన జీవోపై జూపల్లికి కనీస అవగాహన లేదని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పాలనలో కేవలం 2.80 లక్షల కోట్ల అప్పు చేసిందని ఆర్బీఐ, కాగ్ లెక్కలు చెబుతుంటే సీఎం, డిప్యూటీ సీఎంలు పొంతన లేని కాకి లెక్కలతో ప్రజలను మభ్యపెడుతున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో ‘ఆర్ఆర్ టాక్స్’ వసూలు చేస్తున్నారని స్వయంగా ప్రధానమంత్రి మాట్లాడినా ఇప్పటి వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని బీజేపీని ప్రశ్నించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై జరిగిన ఈడీ దాడుల విచారణ ఏమైందో బండి సంజయ్ సమాధానం చెప్పాలన్నారు. అమృత్ టెండర్లలో జరిగిన భారీ అవినీతిపై ఎందుకు విచారణ జరపడం లేదని, కాంగ్రెస్ సర్కారులో బీజేపీ ఎంపీలకు కాంట్రాక్టులు ఎలా దక్కుతున్నాయో సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. సీఎం, మంత్రులు ఇవాళ పారిపోయినా వదిలిపెట్టే ప్రసక్తే లేదని, నాలుగు కోట్ల ప్రజల పక్షాన నిత్యం ప్రజాక్షేత్రంలో నిలదీస్తూనే ఉంటామని కేటీఆర్ స్పష్టం చేశారు. నిన్న ఒకే వేదికపై ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం పొంతన లేని గణాంకాలు చెప్పి అడ్డంగా దొరికిపోయారని ఎద్దేవా చేశారు. గతంలో నోట్ల కట్టలతో దొరికిన రేవంత్ కు రాష్ట్రంలో విశ్వసనీయతే లేదన్నారు. కోటి ఎకరాలను నిషేధిత జాబితాలో పెట్టి ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. పొంగులేటి కుమారుడు వట్టినాగులపల్లిలో కంపెనీలపై పడి భూములను దోచుకుంటున్నారని ఆరోపించారు. తాము హైదరాబాద్‌లో లక్ష డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టాం.. దమ్ముంటే పొంగులేటి లక్షా ఒకటో ఇల్లు కట్టి చూపించాలని సవాల్ విసిరారు. 6 గ్యారంటీలు 420 హామీలు 14 డిక్లరేషన్ల పేరిట రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను రేవంత్ సర్కార్ చేసిన ద్రోహాన్ని ఎండగడతామని తెలిపారు. త్వరలోనే రైతు సంగ్రామ సదస్సులు, యువజన, విద్యార్థి సదస్సుల ద్వారా కాంగ్రెస్ మోసాలను ఎక్కడికక్కడ నిలదీసి ప్రజలను చైతన్యవంతం చేస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు.

**5000 ఉద్యోగాలకే నోటిఫికేషన్ అని మోసం చేస్తోంది**

రాష్ట్రంలో 20 వేల పోలీసు ఉద్యోగ ఖాళీలు ఉంటే కేవలం 5000 ఉద్యోగాలకు మాత్రమే నోటిఫికేషన్ వేస్తామని ప్రభుత్వం దారుణంగా మోసం చేస్తున్నదని పోలీసు ఉద్యోగాల అభ్యర్థులు మండిపడ్డారు. వందలాదిమంది అభ్యర్థులు తెలంగాణ భవన్ కు తరలివచ్చి కేటీఆర్ ను కలిశారు. పోలీసు ఉద్యోగ నోటిఫికేషన్ కోసం రెండున్నరేళ్లుగా తాము కోచింగ్ తీసుకుని సిద్ధమైతే ప్రభుత్వం తూతూమంత్రంగా నోటిఫికేషన్ వేసి చేతులు దులుపుకునే కుట్ర చేస్తున్నదని ఆయన దృష్టికి తెచ్చారు. నిరుద్యోగుల నిరసనలతో అశోక్ నగర్ చిక్కడపల్లితోపాటు దిల్ సుఖ్ నగర్ రగిలిపోతున్నదని, ప్రభుత్వం నిరుద్యోగులను ఉక్కుపాదంతో అణచివేస్తున్నదని మండిపడ్డారు. నిరుద్యోగులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, ఓసారి మీరు కూడా దిల్ సుఖ్ నగర్ కు రావాలని కోరారు. ఈ రెండున్నరేళ్లలో నిరుద్యోగుల పక్షాన ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉన్నామని, తప్పకుండా దిల్ సుఖ్ నగర్ కు వస్తానని కేటీఆర్ హామీ ఇచ్చారు. తొలి ఏడాదే రెండులక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని మాట ఇచ్చిన రేవంత్ రెడ్డి నిరుద్యోగులకు తీరని ద్రోహం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా కేంద్రం మెడలు వంచి కేసీఆర్ 95 శాతం లోకల్ రిజర్వేషన్ సాధించారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో భర్తీ చేసిన 65 వేల ఉద్యోగాలను కూడా తమ ఖాతాలో వేసుకునే నీచానికి ఈ ముఖ్యమంత్రి ఒడికట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే 20వేల పోలీసు ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# బీఆర్ఎస్ గూండాగిరికి భయపడేది లేదు

**హైదరాబాద్, జూలై 2 :**



బీఆర్ఎస్ పార్టీ గూండాగిరికి కాంగ్రెస్ ప్రభుత్వం భయపడేది లేదని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. గురువారం ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు స్పందించారు. కోట్లాది రూపాయలు కొల్లగొట్టిన బీఆర్ఎస్ నాయకులు ఇంకా అధికారంలోనే ఉన్నాం.. లేదా మళ్లీ అధికారంలోకి వస్తామనే భ్రమతో మాట్లాడుతున్నారన్నారు. వారి అవినీతిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు అసెంబ్లీ సాక్షిగా బయటపెట్టారని, అయినా ఇంకా అధికారంలోకి వస్తామని పగటి కలలు కంటూ ఈ ప్రభుత్వంపై గుడ్డకాల్చి వేసి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. గత పదేళ్లలో వారు అంటించుకున్న బురదను ఇప్పటి ప్రభుత్వానికి లేదా మంత్రులకు అంటించాలని చూస్తున్నారని విమర్శించారు. ఐదేళ్ల పాలనకు ప్రజలు కాంగ్రెస్‌కు అధికారమిస్తే మతి భ్రమించి రెండున్నరేళ్లకే గద్దె దిగమని డిమాండ్ చేయడం హాస్యాస్పదమన్నారు. ఈ రెండున్నరేళ్లలో ఏం జరిగిందో ఎలాంటి తీర్పులు వచ్చాయో రాష్ట్ర ప్రజలకు, దేశానికి తెలుసునని అన్నారు. ఏశాఖ అయినా సరే పిలిచిన టెండర్ మొత్తం కంటే మూడు నాలుగు రెట్లు అవినీతి జరిగిందని ఆరోపించడం వారి అవివేకానికి నిదర్శనం అంటూ ఇలాగే వారి ప్రవర్తన కొనసాగితే రానున్న కాలంలో వారికి ప్రతిపక్ష హోదా కూడా దక్కదని హెచ్చరించారు. మీ సవాల్‌ను స్వీకరించి తమ మంత్రులు వస్తే మీరు రాకుండా పరారయ్యారని, మా మంత్రులు అక్కడే గంట వరకూ వేచి చూసి మీడియాతో మాట్లాడి వచ్చారని తెలిపారు. అసెంబ్లీలో కూడా మీరు ఏం మాట్లాడతారో మాకు తెలుసు. దానికి కూడా తేదీని ఖరారు చేస్తాం.. అని పొంగులేటి అన్నారు.

## బీఆర్ఎస్ చేసిన అప్పులపై చర్చకు సిద్ధమే

**హైదరాబాద్, జూలై 2:**

బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పుల వివరాలపై చర్చకు సిద్ధంగా ఉన్నట్లు మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గత ప్రభుత్వం రూ.7.3 లక్షల కోట్ల అప్పులు చేసిందన్నారు. కేవలం కాళేశ్వరం ప్రాజెక్టు కోసం రూ.74వేల కోట్ల అప్పు చేసిందన్నారు. తాను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నా. తాము అప్పులు చేయలేదని కేసీఆర్ చెప్పాలి. నేను చెప్పింది అబద్ధమైతే రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నా. కార్పొరేషన్ పేరుతో అప్పు చేసి కాళేశ్వరం కట్టామని చెబుతున్నారు. అది నిజమా కాదా చెప్పాలన్నారు. ఇలా అప్పులు చేసి, ఎలా తీరుస్తారో ఎందుకు చెప్పలేదన్నారు. ఆ అప్పులను రైతుల నుంచి వసూలు చేస్తారా? ఒక్కో రైతు నుంచి రూ.20 లక్షలు వసూలు చేస్తారా?మేం చేసిన ఆరోపణలపై కేసీఆర్ ఎందుకు స్పందించడం లేదన్నారు. నా వద్ద ఉన్న రికార్డులు, కాగితాలు ఇస్తా.. చర్చకు రావాలి. మాజీ మంత్రులు హరీష్ రావు, కేటీఆర్ ఇంకా బుకాయిస్తున్నారు. బీఆర్ఎస్ చేసిన అప్పులను కేసీఆర్ స్వయంగా మీడియాకు చెప్పాలి. గత ప్రభుత్వం చేసిన అప్పులకు నెలకు రూ.6వేల కోట్ల వడ్డీ కడుతున్నామని జూపల్లి అన్నారు. మరోవైపు అప్పులపై చర్చించేందుకు తెలంగాణ భవన్‌కు వస్తానన్న మంత్రి జూపల్లి ఎందుకు రాలేదని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. ఆయన కోసం కేటీఆర్ వేచి చూస్తున్నారని అన్నారు. చర్చకు సవాల్ విసిరిన మంత్రులు తోక ముడిచి పారిపోయారని విమర్శించారు.



# 2వేల అదనపు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి

**హైదరాబాద్, జూలై 2(రాజముద్ర న్యూస్) :**

ఏజెన్సీ ప్రాంతంలోని నియోజకవర్గాల్లో అదనంగా రెండు వేల ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని ఆదివాసీ గిరిజన ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. సచివాలయంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క నాయకత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన ఆదివాసి, గిరిజన శాసనసభ్యులు పలు అంశాలపై వినతి పత్రాలు అందించారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వడంతోపాటు ఇందిర గిరి జల వికాస పథకం అమలు చేయాలని, గిరిజన ఆశ్రమ పాఠశాలలను ఇంటర్ వరకు ఉన్నతీకరించాలని, ఐటీడీఏలను మరింత బలోపేతం చేయాలని కోరారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలలో అశ్వరావుపేట, పినపాక, ఇల్లందు, భద్రాచలం, ఖానాపూర్ శాసన సభ్యులు జారే ఆదినారాయణ, పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, తెల్లం వెంకటరావు, వెడ్మ బొజ్జు ఉన్నారు. వీరితోపాటు మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, అజారుద్దీన్‌లు కూడా ఉన్నారు.

# స్పీడ్ పోస్ట్ ద్వారా పార్సిళ్లలో గంజాయి

**హైదరాబాద్, జూలై 2(రాజముద్ర న్యూస్):**

దేశవ్యాప్తంగా స్పీడ్ పోస్ట్ ద్వారా గంజాయి సరఫరా చేస్తున్న ముఠాను అరెస్ట్ చేశామని హైదరాబాద్ సీపీ సజ్జనార్ తెలిపారు. రైళ్లు, విమానాల ద్వారా వచ్చిన స్పీడ్ పోస్ట్ పార్సిళ్లకు స్కానింగ్ లేకపోవడంతో సరఫరా సులభమైందన్నారు. దీంతో ఇక పోస్టల్ పార్సిళ్లకు తప్పనిసరి స్కానింగ్ అమలు చేయాలని కేంద్ర శాఖలకు లేఖ రాయనున్నట్లు తెలిపారు. ఎస్ఆర్ నగర్, గుడిమల్కాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పార్సిల్‌పై అనుమానం కలిగి దర్యాప్తు చేశామని, హైదరాబాద్‌కు వచ్చిన 2 పార్సిల్స్ ఫ్లైట్‌లోనే వచ్చాయన్నారు. నగరంలోని అన్ని కొరియర్ సంస్థలకు ప్రతి పార్సిల్‌ను తప్పనిసరిగా స్కాన్ చేయాలని ఆదేశాలు జారీ చేస్తాన్నారు. అనుమానాస్పద పార్సిళ్లు వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సీపీ సజ్జనార్ విజ్ఞప్తి చేశారు.గురువారం మీడియాతో మాట్లాడుతూ అధికారులు, గుడిమల్కాపూర్ పోలీసులు జాయింట్ ఆపరేషన్ నిర్వహించి నిందితుల్ని అరెస్ట్ చేశారన్నారు. గంజాయిను స్పీడ్ పోస్ట్ ద్వారా డోర్ డెలివరీ చేస్తున్నారని, జార్ఖండ్‌కు చెందిన సత్యం మిశ్రాను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. ఇంటర్ చదివిన సత్యం మిశ్రా పెయింట్ పని చేసి మానేశాడని, ఆ తర్వాత లారీ డ్రైవర్‌గా పనిచేశాడన్నారు. 2018లో గంజాయికి అలవాటు పడ్డ మిశ్రా రాహుల్ జై, సచిన్ మిశ్రా, సంతోష్‌తో సిండికేట్‌గా ఏర్పడి సొంత ఊరిలోనే గంజాయి పంట వేశాడని తెలిపారు. ఊరిలో చాలామందితో గంజాయి పంట పండించి కొనుగోలు చేసి కస్టమర్లకు సరఫరా చేస్తున్నారని చెప్పారు. మరో నలుగురు నిందితులు పరారీలో ఉన్నారన్నారు. స్పీడ్ పోస్ట్, కొరియర్ సేవల ద్వారా 21 రాష్ట్రాలకు గంజాయి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్, ముంబై, చెన్నై, ఢిల్లీ, బెంగళూరు సహా పలు నగరాలకు గంజాయి సరఫరా చేస్తున్నారని సజ్జనార్ తెలిపారు. పార్సిళ్లలో మందులు ఉన్నట్లు తప్పుడు డిక్లరేషన్ ఇచ్చి పోస్టల్ అధికారులను మోసగిస్తున్నారని.. ఇస్రో బజార్, ఫుస్రో పోస్టాఫీసుల నుంచి స్పీడ్ పోస్ట్ ద్వారా పార్సిళ్లు బుక్ చేసినట్లు గుర్తించామన్నారు. వాట్సాప్, సోషల్ మీడియా ద్వారా ఆర్డర్లు తీసుకుని జఖఎ ద్వారా నగదు లావాదేవీలు జరిగేవన్నారు. రోజుకు 80 100 ఆర్డర్లు వస్తుండగా.. అందులో 8 నుంచి 10 వరకు స్పీడ్ పోస్ట్ పార్సిళ్ల ద్వారా గంజాయి పంపిణీ చేస్తున్నారన్నారు. ఒక్కో పార్సిల్‌లో 50 - 250 గ్రాముల గంజాయి ఉంచుతూ డెలివరీ చేస్తున్నారని.. ఒక్కో ప్యాకెట్ రూ.1,500 నుంచి రూ.8,000 వరకూ విక్రయిస్తున్నట్లు తెలిపారు. రోజుకు సుమారు రూ.1 లక్ష ఆదాయం లభించగాbw నెలకు రూ.30 లక్షల నుంచి రూ.35 లక్షలు, ఏడాదికి రూ.4 కోట్ల నుంచి రూ.5 కోట్ల టర్నోవర్ ఉందన్నారు. సరఫరాదారులు, కస్టమర్స్ మధ్య కోడ్స్ ద్వారా ఆన్‌లైన్ బుకింగ్ జరుగుతుందని తెలిపారు. వాట్సాప్‌లో వివిధ కోడ్స్ ద్వారా కస్టమర్స్ గంజాయి ఆర్డర్ చేస్తున్నారని అన్నారు. వచ్చిన డబ్బుతో నిందితులు బంగారం, లగ్జరీ వాహనాలు కొనుగోలు చేశారని సీపీ వెల్లడించారు. నిందితులు పలు బ్యాంక్ ఖాతాలు, ఐడీలతో మనీలాండరింగ్ చేసినట్లు గుర్తించామన్నారు.

# సెల్ఫ్ గోల్ కొట్టిన ప్రభుత్వం

- మాట తప్పిన జూపల్లి రాజీనామా చేయాలి
- గురుకుల టెండర్లలో అవకతవకలపై ఆధారాలతో మాట్లాడాం
- ఫోన్ చేస్తే మంత్రులు సమాధానం చెప్పలేదు
- ఒక శాఖపై మరో శాఖ కోర్టుకు వెళ్లే దుస్థితి
- మాజీ మంత్రి హరీష్‌రావు

హైదరాబాద్, జూలై 2(రాజముద్ర న్యూస్):

'ఈ ప్రభుత్వం సవాళ్లు విసిరి చివరకు తోక ముడిచింది.. గోల్ కొడతామనుకుని సెల్ఫ్ గోల్ కొట్టుకున్నారు. జూపల్లి కృష్ణారావు రూ.8 లక్షల కోట్ల అప్పు చేశారని ఆరోపిస్తూ తెలంగాణ భవన్‌కు వచ్చి సవాల్ విసిరారు.. కేటీఆర్, తాను తెలంగాణ భవన్‌లో ఉంటే చర్చకు రాలేద'ని హరీష్‌రావు విమర్శించారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ చీమూ నెత్తురు ఉంటే, పాలమూరు పౌరుషం ఉంటే జూపల్లి రాజీనామా చేయాలన్నారు. నిన్న రూ.8 లక్షల కోట్ల అప్పు అన్నారు... ఈరోజు రూ.7 లక్షల కోట్ల అప్పు అంటున్నారు. జూపల్లి మాట తప్పారు.. రాజీనామా చేయాల్సిందేనన్నారు. సబ్జెక్ట్ లేకుండా, పస లేకుండా సవాల్ విసిరి చివరకు తోక ముడిచారు. అప్పులపై గతంలోనే అసెంబ్లీ సాక్షిగా తాము లెక్కలు చెప్పాం. తోక ముడిచింది మీరే. పోలీసులను పెట్టి చర్చను అడ్డుకున్నారు. గురుకుల టెండర్లలో అవకతవకలు జరిగాయని నేను, ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్, కొప్పుల ఈశ్వర్ ఆధారాలతో మాట్లాడాం. అడ్లూరి లక్ష్మణ్ మొదట ప్రెస్ క్లబ్‌కు వస్తానన్నారు. తర్వాత హరీశ్ రావే రావాలని షరతులు పెట్టారు. తాము సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌కు రావడానికి సిద్ధమైతే పోలీసులు అడ్డుకున్నారు. మమ్మల్ని గన్‌పార్క్‌కు కూడా రానివ్వలేదు. అజారుద్దీన్, అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్‌లకు ఫోన్ చేస్తే ఫోన్ కూడా ఎత్తలేదు. టెండర్లలో అవినీతి జరిగిందని తేటతెల్లమైంది. కంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్ లో కుర్చీలు ఏర్పాటు చేసినా చర్చకు రాలేదు. ప్రభుత్వం చర్చకు సిద్ధంగా లేదు. అవినీతి చేసినందుకే పోలీసులను అడ్డుపెట్టుకుని తప్పించుకుంది. అడ్లూరి లక్ష్మణ్ గారు పూటకో మాట మాట్లాడుతున్నారు. కాళేశ్వరం ఖర్చు 84 వేల కోట్లు అయితే, లక్ష కోట్ల అవినీతి అంటూ దుష్ప్రచారం చేశారు. మేము రూ.2,000 కోట్ల టెండర్లలో స్కాం జరిగిందంటే... మీరు ముందుగా రూ.687 కోట్లు, తర్వాత రూ.1,142 కోట్లు అన్నారు. గురుకుల కిరాణా టెండర్లు రూ.800 కోట్లకు పిలిచారు. పత్రికల్లో రూ.200 కోట్ల గోల్‌మాల్ జరిగిందని వచ్చింది. ఈ టెండర్ విధానంపై కొందరు కోర్టును ఆశ్రయించారు. మొదటి నుంచే పిల్లలు తినే ఆహారం, గుడ్ల కొనుగోళ్లలో కూడా స్కాం జరిగిందని చెబుతున్నాం. పామాయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్, గరం మసాలా వంటి వస్తువులను అధిక ధరలకు కొనుగోలు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 2017లో చేనేత కార్మికులకు ఉపాధి కల్పించేందుకు జీవో తీసుకొచ్చింది. పోలీసు, పాఠశాల, గురుకుల యూనిఫాంల ఆర్డర్లు టెస్కోకే ఇవ్వాలనే నిబంధన ఉండేది. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ నిబంధనలను ఉల్లంఘించి పెద్ద కాంట్రాక్టర్లకు టెండర్లు ఇచ్చింది. దీనిపై కోర్టుకు వెళ్తే చేనేత కార్మికుల జీవనోపాధిని దృష్టిలో పెట్టుకుని ఆర్డర్లు ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన జీవోను అమలు చేయాలని న్యాయమూర్తి నందా ఆదేశించారు. అయినా అమలు చేయకపోవడంతో వీరాంజనేయ హ్యాండ్‌లూమ్ సొసైటీ మళ్లీ హైకోర్టును ఆశ్రయించింది. ఈ కేసులో కూడా హైకోర్టు చేనేత కార్మికుల జీవనోపాధిపై దెబ్బ కొట్టొద్దని స్పష్టం చేసింది. కమిషన్ల కోసం ప్రభుత్వం ఇప్పటికే ఇచ్చిన ఆర్డర్లను వెనక్కి తీసుకుంది. ఆర్డర్లను రద్దు చేసిన చర్య తప్పని హైకోర్టు వ్యాఖ్యానించింది. కొండా సురేఖ కూడా ముఖ్యమంత్రికి లేఖ రాశారు. వేలాది చేనేత కార్మికులు రోడ్డున పడతారని లేఖలో పేర్కొన్నారు. దయాపూర్వక పరిశీలన కోరినా ప్రభుత్వం పట్టించుకోలేదు. రేవంత్ రెడ్డికి గుజరాత్ దళారులపై ఉన్న దయ.. చేనేత కార్మికులపై లేదు.. "మఫత్‌లాల్ ముద్దు.. చేనేత వద్దు" అన్నదే ప్రభుత్వ వైఖరి. బీఆర్ఎస్ ప్రభుత్వం 2022లో జీవో నెం.110 తీసుకొచ్చింది. ఆ జీవో ప్రకారం బట్టలు, బూట్ల కొనుగోళ్లు లిడ్‌క్యాప్ ద్వారా జరగాలి. ఒక శాఖ మరో శాఖపై కోర్టుకు వెళ్లే పరిస్థితి ఏర్పడింది. ఇదే స్కాంకు నిదర్శనం. లిడ్‌క్యాప్ నుంచి ఆర్డర్లు లాక్కొని దళిత బిడ్డలను మోసం చేశారు. కేసీఆర్ హయాంలో మాకే ఆర్డర్లు ఇచ్చేవారని లిడ్‌క్యాప్ లేఖ రాసింది. అలాంటప్పుడు స్కాం జరగలేదని అడ్లూరి లక్ష్మణ్ గారు ఎలా చెబుతారు? బీఆర్ఎస్ మద్దతుతోనే మీరు జడ్పీ చైర్మన్ అయ్యారు. శ్రీధర్ బాబుకు కూడా లిడ్‌క్యాప్ లేఖ రాసింది. పీఎంయూ చైర్మన్‌కూ లేఖ రాసి దళిత బిడ్డల నోరు కొట్టొద్దని విజ్ఞప్తి చేసింది. ప్రభుత్వం ఇచ్చిన జీవోను తుంగలో తొక్కింది. దళిత మంత్రి, శ్రీధర్ బాబు, పీఎంయూ చైర్మన్ పట్టించుకోలేదు. గుజరాత్ దళారులకు ఆర్డర్లు కట్టబెట్టారు. చివరకు దళిత బిడ్డలు హైకోర్టుకు వెళ్లాల్సి వచ్చింది. హైకోర్టు చెప్పిన తర్వాతే 10 శాతం ఆర్డర్లు ఇచ్చారు. చెప్పుడేమో ఘనం.. చేతలేమో శూన్యం. చేవెళ్ల డిక్లరేషన్‌లో ఎస్సీ, ఎస్టీలకు టెండర్లు, ప్రొక్యూర్‌మెంట్ లో రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి మోసం చేశారు. మీ ఎస్సీ, ఎస్టీ చేవెళ్ల డిక్లరేషన్ కాకి ఎత్తుకుపోయిందా? కేసీఆర్ వైన్ షాపులు, ఇరిగేషన్, ఆసుపత్రుల టెండర్లలో రిజర్వేషన్లు కల్పించారు.. మరి మీరు చర్చకు ఎందుకు రావడం లేదు? నోట్‌బుక్స్ కొనుగోళ్లలో రూ.150 కోట్ల కమిషన్ కోసం వాటర్‌మార్క్ నిబంధన పెట్టారు. మేము బయటపెట్టడంతో టెండర్లు రద్దు చేశారు. ఇప్పటికీ పాఠశాలలకు నోట్‌బుక్స్ అందలేదు. సీఎం, ఐఏఎస్ అధికారుల పిల్లలు కూడా నోట్‌బుక్స్ లేకుండా పాఠశాలలకు వెళ్తారా? మీ వల్ల పిల్లల చదువులు దెబ్బతింటున్నాయి. ఈ ప్రశ్న అడగడం తప్పా? ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ గట్టిగా ప్రశ్నిస్తున్నారని ఆయన భార్య లక్ష్మీభాయిని బదిలీ చేశారు. శ్రీధర్ బాబు సతీమణి మా ప్రభుత్వంలో పనిచేశారు.. మేము ఇలా చేశామా? ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ గారి భద్రతను తగ్గించారు. రిటైర్ అయ్యే ఏడాది ముందు ఆయన భార్యను ఉద్దేశపూర్వకంగా బదిలీ చేశారు. గురుకులాల్లో చదివే 6 లక్షల మంది పిల్లల కోసం, ఎస్సీ, ఎస్టీ బిడ్డల భవిష్యత్తు కోసం బీఆర్ఎస్ పోరాటం చేస్తుందన్నారు.

# పోలీస్ శాఖ కీలక నిర్ణయం

- మాజీ డీజీపీలకు బుల్లెట్‌ప్రూఫ్ వాహనాల తొలగింపు

హైదరాబాద్, జూలై 2(రాజముద్ర న్యూస్):



తెలంగాణ పోలీస్ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. మాజీ డీజీపీలతో పాటు ప్రస్తుతం కీలక పోస్ట్‌లలో ఉన్న పోలీస్ అధికారులకు బుల్లెట్ ప్రూఫ్ వాహనాలు తొలగిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిర్ణయంతో మాజీ పోలీస్ అధికారులకు బుల్లెట్ ప్రూఫ్ వాహనాలు తొలగించనున్నారు. 20 మంది మాజీ పోలీస్ ఉన్నతాధికారులతోపాటు ప్రస్తుత అధికారులకు బుల్లెట్ వాహనాలు తీసివేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మాజీ డీజీపీలు స్వరజిత్ సేన్, ఏకే ఖాన్, ఏకే మహంతి, దినేష్ రెడ్డి, జితేందర్, మహేందర్ రెడ్డి, అనురాగ్ శర్మ, పూర్ణచందర్రావు, కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి, నవీన్ ఛంద్, డానియల్, వెంకట్రామిరెడ్డి, స్టీఫెన్ రవీంద్ర, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, డీటి నాయక్, ఉమేష్ షరీఫ్, రవి గుప్తా. ఇంటెలిజెన్స్ చీఫ్ విజయ కుమార్ మొదలైన అధికారులకు బుల్లెట్ ప్రూఫ్ వాహనాలు తొలగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. మాజీ అధికారులతో పాటు ప్రస్తుత అధికారులకు కూడా ఈ నిర్ణయం వర్తించేలా ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ లకు బులెట్ ప్రూఫ్ వాహనాలను తీసివేశారు. మాజీ డీజీపీలకు ఉన్న ఎస్కార్ట్ వాహనాలను సైతం తీసివేసింది పోలీస్ శాఖ.పలువురు రాజకీయ నేతలతో పాటు పోలీసు అధికారులకు ఉన్న గన్ మెన్‌ల సంఖ్య తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నారు. చాలావరకు వన్ ప్లస్ వన్ గన్ మెన్‌లకే పరిమితం చేసింది. నక్సల్స్ ప్రభావం పూర్తిగా తొలగిపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దీంతో ప్రభుత్వానికి భారీగా ఆదా కానుంది.

# బోడుప్పల్‌లో భూపోరాటానికి దిగిన కవిత

- అడ్డుకుని అరెస్ట్ చేసిన పోలీసులు

హైదరాబాద్, జూలై 2(రాజముద్ర న్యూస్):



తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవితను బోడుప్పల్‌లో పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని బోడుప్పల్‌లో భూ పోరాటానికి టీఆర్ఎస్ సిద్ధమైంది. ఇందులో భాగంగా బోడుప్పల్ చేరుకుని భూ పోరాటం చేస్తున్న కవితను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులతో టీఆర్ఎస్ కార్యకర్తలు వాగ్వాదానికి దిగారు. తోపులాట చోటు చేసుకోవడంతో కవితతో పాటు టీఆర్ఎస్ శ్రేణులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అక్కడి నుంచి బొల్లారం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఉప్పల్‌లో ఈరోజు తెలంగాణ ఉద్యమకారులు, మహిళల రక్తం చిందిందని కవిత అన్నారు. బొల్లారం పీఎస్ వద్ద టీఆర్ఎస్ చీఫ్ మాట్లాడుతూ.. మహిళలు, తెలంగాణ ఉద్యమకారులపై పోలీసులు విచక్షణారహితంగా లాఠీఛార్జ్ చేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను మాత్రమే అడిగాం తప్ప వేరే డిమాండ్లు ఏ అడగలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి నేటి నుంచి కౌంట్‌డౌన్ స్టార్ట్ అయ్యిందన్నారు. ఉద్యమకారులకు వాళ్లు ఇస్తామన్న 250 గజాల స్థలం ఇవ్వాలని మాత్రమే అడిగామని తెలిపారు. కచ్చితంగా ఉద్యమకారులకు ఇస్తామన్న హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అడిగితే ఉద్యమకారులపై లాఠీఛార్జ్ చేసి రక్తం చిందేలా కొట్టడం అన్యాయమన్నారు. ఉద్యమకారులకు హామీలను ఈ ప్రభుత్వానికి రోజూ గుర్తు చేస్తూనే ఉంటామని కవిత స్పష్టం చేశారు.

# ఖమ్మం విజయ పాల డెయిరీకి ఇడుపు కాయితం!

- లాభాల్లో నడుస్తున్న పాల ప్యాకింగ్ ప్లాంటును మూసేయాల్సిన అవసరమేంటి?
- ప్రైవేటు డెయిరీలకు కట్టబెట్టే కుట్ర దాగుందన్న అనుమానాలు

ఖమ్మం, జూలై 2(రాజముద్ర న్యూస్):




ఇడుపు కాయితం.. ఈ పేరు ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో హాట్ టాపిక్ గా మారింది. భర్త, భార్య విడిపోవడానికి రాసుకునే అంగీకార పత్రమే ఇడుపు కాయితం. ఇప్పుడు ఈ ప్రస్తావన ఎందుకంటే యాభై ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన ఖమ్మం ప్రభుత్వ పాడి పరిశ్రమ (విజయ డెయిరీ) ఇక్కడ నుంచి విడిపోయే పరిస్థితి నెలకొంది. ఇక అసలు విషయానికి వస్తే.. జిల్లా కేంద్రం అయిన ఖమ్మం నగరంలో ఇందిరా నగర్ లో ఏర్పాటు చేసిన పాల డెయిరీ మనుగడ ఇప్పుడు ప్రశ్నార్ధకంగా మారింది. పాడి రైతుల సంక్షేమం, పాడి పరిశ్రమాభివృద్ధికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని పాలకులు ఒక వైపు ప్రకటిస్తుండగా మరో వైపు ఇక్కడి డెయిరీని మూసివేసే దిశగా తెరవెనుక సంబంధిత ప్రభుత్వ యంత్రాంగం వేగంగా అడుగులు వేస్తోంది. లాభాల బాటలో నడుస్తున్న పాల ప్యాకింగ్ ప్లాంటును ఆకస్మాత్తుగా మూసివేసి వరంగల్ కు తరలించేందుకు జరుగుతున్న ప్రయత్నాలు ఉమ్మడి ఖమ్మం వ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతున్నాయి.

**రోడ్డున పడనున్న పాడి రైతులు**

పాల కేంద్రం మూసివేత కేవలం ఒక ప్లాంట్ కు సంబంధించిన విషయం కాదు. దశాబ్దాలుగా ఈ డెయిరీని నమ్ముకుని పాల ఉత్పత్తి చేస్తున్న సుమారు 12 వేల మంది రైతుల జీవనోపాధికి సంబంధించినది. పాల ప్యాకింగ్ యూనిట్ ఇక్కడి నుంచి తరలిపోతే పాల సేకరణపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఈ డెయిరీపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడి బతుకుతున్న వందలాది మంది కార్మికులు, ఉద్యోగుల పరిస్థితి అగమ్యగోచరంగా మారనుంది. మరో వైపు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ప్రభుత్వ హాస్టళ్లకు ఖమ్మం కేంద్రం నుంచే పాలు అతి కష్టంగా సరఫరా అవుతున్న పరిస్థితి ఉంది. అలాంటిది వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న వరంగల్ నుంచి రోజూ హాస్టళ్లకు పాలు సకాలంలో ఎలా సరఫరా చేస్తారనేది ప్రశ్న తలెత్తుతోంది. ఈ నిర్ణయంతో విద్యార్థుల్లో సైతం ఆందోళన వ్యక్తమవుతోంది. వరంగల్ నుంచి పాల ప్యాకెట్లు తెప్పించి సరఫరా చేసే క్రమంలో రవాణా భారం, జాప్యం భరించలేక డిస్ట్రిబ్యూటర్లు చేతులెత్తేస్తే క్రమంగా ఆ సరఫరా కాంట్రాక్టులను ప్రైవేట్ డెయిరీలకు కట్టబెట్టే భారీ కుట్ర జరుగుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**అసలు కథ భూముల చుట్టేనా?**

డెయిరీ మూసివేత వెనుక ప్రధాన కారణం ఖమ్మం నగర నడిబొడ్డున ఉన్న వందల కోట్ల విలువైన విజయ డెయిరీ భూములే అన్న అనుమానాలు బలంగా వ్యక్తమవుతున్నాయి. గతంలో పనిచేసిన ఒక ఎమ్మార్వో విజయ డెయిరీ భూములను ఖాళీగా ఉన్న భూములుగా ప్రభుత్వానికి నివేదిక ఇవ్వడం వెనుక పెద్ద ఎత్తుగడ ఉందనే విమర్శలు ఉన్నాయి. ఇటీవలే హైదరాబాద్ లాలాగూడలోని వేల కోట్ల విలువైన 35 ఎకరాల భూమిని అమెజాన్ సంస్థకు లీజుకు ఇచ్చినట్లు వస్తున్న వార్తలు ఈ అనుమానాలకు మరింత బలంచేకూరుస్తున్నాయి. హైదరాబాద్ తరహాలోనే ఖమ్మం డెయిరీ ఆస్తులను సైతం కార్పొరేట్ సంస్థలకు లేదా రియల్ ఎస్టేట్ బడాబాబులకు కట్టబెట్టేందుకే ప్లాంట్ ను ఖాళీ చేయిస్తున్నారా అన్న సందేహాలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయి. విజయ డెయిరీ ఆస్తుల పరిరక్షణలో ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. భద్రాచలం నడిబొడ్డున ఉన్న సుమారు ఆరు ఎకరాల విజయ డెయిరీ భూములు ఇప్పటికే అక్రమార్కుల చేతుల్లోకి వెళ్లినా ప్రభుత్వంగానీ, అధికారులుగానీ పట్టించుకున్న పాపాన పోలేదు. మరోవైపు యాభై ఏళ్ల చరిత్ర కలిగిన విజయ డెయిరీ సంస్థకు చెందిన మిల్క్ ప్రొడక్ట్స్ (పాల ఆధారిత ఉత్పత్తులు) తయారీ వ్యవస్థను జనగామలోని ఓ ప్రైవేట్ 'శక్తి డెయిరీ'కి అప్పగించడం చూస్తుంటే ప్రభుత్వరంగ సంస్థను క్రమంగా నిర్వీర్యం చేస్తున్నారనేది స్పష్టమవుతోంది. ప్యాకింగ్ యంత్రాలు పాతబడిన కారణంగానే ఖమ్మం ప్లాంటును మూసివేస్తున్నామని, ఇకనుంచి వరంగల్ ప్లాంట్ నుంచి ఖమ్మం జిల్లాకు పాల ప్యాకెట్లు సరఫరా చేస్తాం అని అధికారులు పేర్కొంటున్నారు. కానీ, ఇక్కడే అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి. వాస్తవానికి ఖమ్మం ప్యాకింగ్ ప్లాంట్ కన్నా వరంగల్ ప్లాంట్ ఎన్నో ఏళ్లు పాతది. కొత్త యంత్రాలు కొనుగోలు చేసి లాభాల్లో ఉన్న ఖమ్మం ప్లాంట్ ను ఆధునికీకరించాల్సిందిపోయి పాత యంత్రాలు ఉన్న వరంగల్ కు ప్యాకింగ్ ను తరలించడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇతర జిల్లాల డెయిరీలతో పోలిస్తే ఎంతో మెరుగ్గా, లాభాల్లో నడుస్తున్న ఖమ్మం డెయిరీని కాపాడుకోవాల్సిన బాధ్యత స్థానిక ప్రజాప్రతినిధులు, ముగ్గురు మంత్రులపై ఉందని ప్రజల నుంచి డిమాండ్లు వస్తున్నాయి. ప్రధానంగా వ్యవసాయ శాఖ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న పాల ఆధారిత ఉత్పత్తులు ప్లాంట్ మూసివేతపై బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేసిన విషయం విదితమే. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఖమ్మం ప్లాంట్ మూసివేత నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, అవసరమైన నిధులు మంజూరు చేసి ఇక్కడే నూతన యంత్రాలను ఏర్పాటు చేయాలని పాడి రైతులు, కార్మిక సంఘాలు కోరుతున్నాయి.

# గన్‌పార్క్ వేదికగా కాంగ్రెస్–బీఆర్ఎస్ రాజకీయ పోరు

మొదటిపేజీ తరువాయి

చెప్పారు. హరీశ్‌రావు గన్‌పార్క్‌కు వస్తానంటే తాను కూడా అక్కడికే వస్తానని ప్రకటించారు. కేటీఆర్, హరీశ్‌రావు ఇద్దరూ కలిసి వస్తే ప్రజల ముందే అన్ని ప్రశ్నలకు సమాధానం ఇస్తానని వ్యాఖ్యానించారు.

**పోలీసుల అడ్డగింత.. అరెస్టులు**

తెలంగాణ భవన్ నుంచి ఆధారాలతో గన్‌పార్క్‌కు బయల్దేరిన హరీశ్‌రావును పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులు, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య తోపులాట చోటుచేసుకుంది. కొద్దిసేపు తెలంగాణ భవన్ పరిసరాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అనంతరం హరీశ్‌రావుతో పాటు పలువురు బీఆర్ఎస్ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకుని కాంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

**భారీ భద్రత**

గన్‌పార్క్ వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీ భద్రత ఏర్పాటు చేశారు. మరోవైపు తెలంగాణ భవన్‌లో చర్చ కోసం మంత్రి జూపల్లి కృష్ణారావు పేరుతో ప్రత్యేకంగా కుర్చీ ఏర్పాటు చేయడం రాజకీయంగా ఆసక్తి రేకెత్తించింది. రాష్ట్ర అప్పుల అంశంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం మరింత ముదిరే సూచనలు కనిపిస్తున్నాయి.

# అల్పాహారంతోపాటు మధ్యాహ్న భోజనం

హైదరాబాద్, జూలై 2(రాజముద్ర న్యూస్):

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు, సిబ్బందికి అల్పాహారంతో పాటు మధ్యాహ్న భోజనం అందించాలని ముఖ్యమంత్రి మంత్రిమండలి సమావేశం నిర్ణయించింది. ముఖ్యమంత్రి అధ్యక్షతన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో గురువారం జరిగిన మంత్రిమండలి సమావేశం పలు కీలక అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకుంది. ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లో విద్యార్థులతోపాటు రాష్ట్రంలోని లక్షా 50 వేల మంది ఉపాధ్యాయులు, లెక్చరర్లు, సిబ్బందికి కూడా ఈ పథకం అమలు చేయాలని సమావేశం తీర్మానించింది. వీబీజీ రామ్‌జీ పథకంపై రాష్ట్రాలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసినప్పటికీ వాటిని పరిగణనలోకి తీసుకోకుండా పథకాన్ని కొనసాగించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో ఈ అంశంపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలని మంత్రివర్గ సమావేశం భావించింది. మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల గురించి మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ధనసరి అనసూయ సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మీడియాకు వెల్లడించారు. కూలీలకు ఉపాధి భద్రత కల్పించాలన్న లక్ష్యంతో 2006లో యూపీఏ ప్రభుత్వ హయాంలో తెచ్చిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వీబీజీ రామ్‌జీ పథకంపై గతంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘం నివేదికపై సమావేశం సుదీర్ఘంగా చర్చించినట్టు వారు తెలిపారు. నిరుపేదల హక్కులను హరించే విధంగా ఉన్న వీబీజీ రామ్‌జీ పథకాన్ని వ్యతిరేకిస్తూ శాసనసభ ఏకగ్రీవ తీర్మానం చేసినప్పటికీ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా యధాతథంగా అమలు చేస్తోందన్నారు. గత్యంతరం లేని, అనివార్య పరిస్థితుల నేపథ్యంలో ఉపాధి హామీ కూలీలకు నష్టం జరగొద్దని ఆ పథకాన్ని రాష్ట్రంలో కూడా అమలు చేయాలని భావించినట్టు చెప్పారు. కొత్తగా అందుబాటులోకి వస్తున్న టిమ్స్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌స్‌లో భారీ ఎత్తున ఉద్యోగ నియామకాలు చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది. సనత్‌నగర్, ఎల్‌బీ నగర్, అల్వాల్ టిమ్స్‌తోపాటు వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో డాక్టర్లు, వైద్య సిబ్బంది నిమాయకానికి 6,278 పోస్టులు మంజూరు చేసింది. ఈ హాస్పిటల్‌స్‌ను నిమ్స్ తరహాలో అభివృద్ధి చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఇక్కడ అందించే వైద్య సేవలకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఎలఓసీలు జారీ చేయాలని నిర్ణయించారు. హైదరాబాద్ మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టులో భాగంగా ఫేజ్ 1లో గాంధీ సరోవర్ వరకు 21 కి.మీ మేరకు పూర్తి చేయడానికి మంత్రిమండలి పరిపాలనా అనుమతులను మంజూరు చేసింది. ఇందుకు సంబంధించి త్వరలోనే టెండర్ ప్రక్రియ ప్రారంభిస్తామని, ఫేజ్ 1 ప్రాజెక్టు అభివృద్ధి కోసం రూ.7,345 కోట్లు మంజూరు చేస్తూ కేబినె□ట్ ఆమోదం తెలిపినట్టు మంత్రులు పేర్కొన్నారు.

# గురుకులాల టెండర్ల అవినీతిపై చర్చకు సిద్ధం

హైదరాబాద్, జూలై 2(రాజముద్ర న్యూస్):

గురుకులాల టెండర్లలో అవినీతిపై చర్చించేందుకు తాము సిద్ధమని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. బీఆరఎస్ సవాల్‌తో మంత్రులు గన్‌పార్క్ వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా పొన్నం వి□డియాతో మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో దేవాలయం లాంటి అసెంబ్లీలో హరీశ్‌రావు చర్చకు రావాలని సవాల్ చేశారు. తాము ప్రెస్‌క్లబ్‌కు కూడా వస్తామని, కానీ రాజ్యాంగం ప్రకారం ఎన్నికైన వ్యక్తులు చర్చకు రావాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికైన ప్రజాప్రతినిధులు ఈరోజు 12 గంటల్లోగా గన్‌పార్క్ దగ్గరకు రావాలన్నారు. మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు వస్తే తాము ఎక్కడైనా చర్చకు వస్తామని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో లాగా కడప కాంట్రాక్టర్లకు తమ ప్రభుత్వం టెండర్లు ఇవ్వలేదని తేల్చిచెప్పారు. తాము పారదర్శకంగా గురుకులాల టెండర్లు జరగాలని చూశామన్నారు. 'గురుకులాల టెండర్ కోసం ముందుకు వచ్చిన కాంట్రాక్టర్ మాకేమైనా చుట్టమా.. టెండర్లలో అసలు అవినీతి జరిగింది రూ.2 వేల కోట్లా.. రూ.5వేల కోట్లా.. బీఆరఎస్ నేతలు ఏది పడితే అది మాట్లాడుతున్నారు.. ఆధారాలతో రండి.. మేము చర్చకు సిద్ధం.. మేము అవినీతి చేసినట్లు నిరూపిస్తే ముగ్గురు మంత్రులం గన్‌పార్క్ దగ్గర ముక్కు నేలకు రాసి రాజీనామా చేస్తాం.. మేము పిరికివాళ్లం కాదు.. ఎవరితో పడితే వారితో చర్చకు రాము.. మాజీ సీఎం కేసీఆర్ గులాబీ పార్టీ నేతలను అదుపులో పెట్టుకోవాలి.. లేదంటే కేసీఆర్‌కు చెడ్డపేరు వస్తుంది.. బీఆరఎస్ నేత ఆరఎస్ ప్రవీణ్ కుమార్ ఏ విషయమైనా మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా మాట్లాడాలి.. ఆయన అవినీతి చేసి ఉండొచ్చు.. ఆరఎస్పీకి మేం సమాధానం చెప్పం.. తమ జోలికి వచ్చి ప్రవీణ్ ఇబ్బందిపడొద్ద'ని మంత్రి పొన్నం హెచ్చరించారు.

**బీఆరఎస్ నేతలే రాకుండా పారిపోయారు : ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం**

కాంగ్రెస్ మంత్రులకు దమ్ము, ధైర్యం ఉందని, అందుకే వారు బహిరంగ చర్చకు ముందుకు వచ్చారని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పేర్కొన్నారు. మంత్రులు పూర్తిగా, పారదర్శకంగా పనిచేస్తున్నారని తెలిపారు. గన్‌పార్క్ వద్ద ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు. తప్పు చేయలేదనే నమ్మకంతోనే ప్రజల ముందుకొచ్చి మంత్రులు చర్చకు సిద్ధమయ్యారని చెప్పారు. అలాగే హరీశ్‌రావు అండ్ కో చర్చకు రావాలని కోరితే వారు తప్పించుకుంటున్నారని విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి విమర్శలనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. గురుకులాలపై వచ్చిన ఆరోపణలకు సమాధానం చెప్పేందుకు మంత్రులు ముందుకొచ్చారని దానం పేర్కొన్నారు.





# తెలంగాణలో సవాళ్ల రాజకీయాలు!

## రెండేళ్ల ముందే ఎన్నికల వేడి..

**రేవంత్, కేటీఆర్ సవాల్-ప్రతిసవాళ్లతో పీక్‌కు చేరిన పొలిటికల్ హీట్!**

తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో సవాళ్లు ప్రతిసవాళ్లతో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. అధికార పార్టీని ఎండగట్టడమే పనిగా బిఆర్‌ఎస్ పనిచేస్తోంది. విపక్ష బిఆర్‌ఎస్ లక్ష్యంగా ఈ మధ్య సిఎం రేవంత్ కూడా ఘాటుగానే దాడి చేస్తున్నారు. ఎపిలో కూడా దాదాపు ఇదే తరహా రాజకీయాలు నడుస్తున్నాయి. జగన్ పార్టీని గొడ్డలి పార్టీ అంటూ అధికార టిడిపి దుమ్మెత్తి పోస్తోంది. జగన్ కూడా ఎపిలో చట్టాలకు విలువ లేకుండా పోయిందని అంటున్నారు. మొత్తంగా అభివృద్ధి, ప్రజల అవసరాలు పక్కకు పోయాయి. సవాళ్లు, ప్రతిసవాళ్లు నడుస్తున్నాయి. తమ రాజకీయం కోసం రాష్ట్ర అభివృద్ధిని, పాలనను పక్కన పెట్టారు. ఇకపోతే తెలంగాణలో అంతకుమించి అన్నట్లుగా సవాళ్లు, ప్రతిసవాళ్లతో రాజకీయాలు వేడెక్కాయి. ఇప్పుడే ఎన్నికలు లేవు. మరో రెండేళ్ల సమయం ఉంది. అయినా అప్పుడే ఎన్నికల వేడి పుట్టించేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీది రెండున్నరేండ్ల చెత్త పాలన అంటూ బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్,హరీష్ రావులు విమర్శలు గుప్పిస్తున్నారు. బిఆర్‌ఎస్ అప్పులు చేసి, రాష్ట్రాన్ని ఆగం చేసిందని సిఎం రేవంత్ సహా మంత్రులు అడపాదడపా విమర్శలు గుప్పిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అవినీతి, అక్రమాల పై లెక్కలతో పక్కాగా వివరిస్తామని ప్రతిగా బిఆర్‌ఎస్ నేతలు సవాళ్లు విసరుతున్నారు. అసెంబ్లీ లేకపోతే వేదిక ఏదైనా బీఆర్‌ఎస్ తరఫున తాను చర్చకు వస్తా.. రాహుల్‌గాంధీ వస్తారో? ఇంకెవరొస్తారో తేల్చుకోండి. మీ పాలనావైఫల్యాలను లెక్కలతో బయటపెట్టకపోతే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకొంటానని కెటిఆర్ చాలెంజ్ చేశారు.కాగా,కేటీఆర్ సవాల్‌కు మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందించారు. తాను తెలంగాణ భవన్‌కు వస్తానని మంత్రి ప్రతి సవాల్ విసిరారు. మంత్రి చాలెంజ్‌ను స్వీకరిచిన బీఆర్‌ఎస్ పార్టీ తెలంగాణ భవన్‌లో మీ కోసం ప్రత్యేకంగా కుర్చీ రెడీగా ఉంది. మీదే ఆలస్యం దమ్ముంటే చర్చకు రావాలన్నారు. దీంతో ఒక్కసారిగా రాష్ట్ర రాజకీయాలు వేడెక్కాయి. అటు తెలంగాణ భవన్, ఇటు గాంధీ భవన్ వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. జూపల్లి వ్యాఖ్యల నేపథ్యంలో కేటీఆర్, హరీశ్ రావు బీఆర్‌ఎస్ భవన్‌కు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. జూపల్లి వస్తే కేంద్ర ప్రభుత్వ నివేదికలు, ఆర్‌బీఐ లెక్కలు, సాక్ష్యాలతో సహా వివరిస్తామని వారు తెలిపారు. కాగా, జూపల్లితో చర్చకు కేటీఆర్ అవసరం లేదని తాను సరిపోతానని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కావాలంటే కేటీఆర్ కూడా వస్తారన్నారు. ఇలా రోజుకో సవాల్, ప్రతి సవాల్‌లో రాజకీయాలు నడుస్తున్నాయి. ఏ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారు. ఎన్ని నెరవేర్చారో చర్చకు బరాబర్ సిద్ధమేనన్నారు. కాంగ్రెస్ అప్పుల బాగోతాన్ని లెక్కలతో తిప్పికొడుతామన్నారు. సవాళ్లు, ప్రతి సవాళ్ల నేపథ్యంలో తెలంగాణలో రాజకీయాలు హాట్‌హాట్‌గా సాగుతున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి కూడా ప్రత్యర్థులకు చెక్ పెట్టేందుకు అడపాదడపా బిజెపి, బిఆర్‌ఎస్‌లను లక్ష్యంగా నేరుగా విమర్శలు చేస్తున్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా రెండున్నరేళ్ళ సమయం ఉన్నా, అప్పుడే ఎలక్షన్ మూడ్ వచ్చేస్తున్నట్టు కనిపిస్తోంది. అన్ని రాజకీయ పార్టీలు అదే తరహా ప్లానింగ్‌లో ఉన్నాయి. అందునా అధికారంలో ఉన్నాం కాబట్టి ఎక్కడా తగ్గకూడదన్న ఉద్దేశ్యం కాంగ్రెస్ పార్టీలో, ప్రత్యేకించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలో కనిపిస్తోంది. రాష్ట్రంలో రెండోసారి అధికారం చేపట్టేందుకు అవసరమైన ఎత్తుగడలకు ఆయన పదును పెడుతున్నట్టు కనిపిస్తోంది. ఎందుకంటే మళ్లీ కాంగ్రెస్ సర్కార్ వస్తుందని, తానే సిఎంనని పదేపదే ప్రకటిస్తున్నారు. ఇదంతాఒక ఎత్తయితే విపక్ష బిఆర్‌ఎస్, బిజెపిలను దెబ్బకొట్టడంతో పాటు, బలంగా లేని చోట కాంగ్రెస్‌ను బలోపేతం చేసే పనిలో పడ్డారని తెలుస్తోంది. ముఖ్యంగా పార్టీ ఎక్కడైతే బలంగా లేదో అక్కడి నుంచే కార్యాచరణ మొదలు పెట్టాలని రేవంత్ రెడ్డి పని చేస్తున్నారు. ఆ రెండు పార్టీలకు చెక్ పెట్టడానికి అక్కడి నుంచే యుద్ధం ప్రారంభించాలని సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం తెలంగాణ పొలిటికల్ సర్కిల్స్‌లో దీనికి సంబంధించిన చర్చలు గట్టిగానే నడుస్తున్నాయి. వచ్చే డిసెంబర్ నుంచి తన పొలిటికల్ స్కెచ్‌ని అమలు చేసే పనిలో ముఖ్యమంత్రి ఉన్నట్టు తెలుస్తోంది. అందుకు ఇప్పటినుంచి గ్రౌండ్ వర్క్ మొదలు పెట్టినట్టు సమాచారం. రాష్ట్రంలో కాంగ్రెస్‌ని రెండోసారి అధికారంలోకి తీసుకొస్తానని ఇప్పటికే చేసిన ప్రకటనకు అనుగుణంగా పొలిటికల్ గ్రౌండ్ ప్రిపేర్ చేసుకునే పనిలో ఉన్నారన్నది పొలిటికల్ టాక్. డిసెంబర్ తర్వాత పూర్తిగా గ్రౌండ్‌లోనే ఉండాలని రేవంత్ డిసైడ్ అయినట్టు కనపడు తోంది. అందుకోసం ప్రధానంగా ఉత్తర తెలంగాణ మీద ఫోకస్ పెట్టబోతున్నారట. దక్షిణ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి గట్టి పట్టుంది. గత ఎన్నికల్లో ఆ విషయం నిరూపితమైంది కూడా. కానీ, ఉత్తర తెలంగాణలో బీజేపీ బలపడుతున్నందున ఇక అక్కడ ఫోకస్ చేయాలన్నది సీఎం ప్లాన్‌గా తెలుస్తోంది. ఉత్తర తెలంగాణ నుండి తన రాజకీయ వ్యూహాన్ని అమలు చేసే పనిలో భాగంగా బస్సు యాత్ర లేదంటే పాదయాత్ర చేయాలని భావిస్తున్నట్టు సమాచారం. ప్రభుత్వ పథకాల అమలు, రాజకీయ ఎత్తుగడల్ని అక్కడి నుంచే అమలు చేయాలని భావిస్తున్నారని సమాచారం. వచ్చే ఎన్నికల నాటికి బీఆర్‌ఎస్, బీజేపీల కట్టడిని అక్కడి నుంచే మొదలుపెట్టాలనుకుంటున్నట్లు అర్థం అవుతోంది. . ఓట్ బ్యాంకును పెంచుకోవడంతో పాటు,తన రెండున్నరేళ్ళ పాలన, గత బీఆర్‌ఎస్ పాలనపై చర్చకు పెట్టడంతో పాటు కేంద్రంలోని బీజేపీ తీరు, రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయం గురించి కూడా ప్రజలు మాట్లాడుకునేలా చేయాలనుకుంటున్నట్టు తెలుస్తోంది. గత ఎన్నికలకు ముందు పాదయాత్ర నిర్వహించారు రేవంత్‌రెడ్డి. అది ఎలా ఉన్నా విపక్ష పార్టీలకు చెక్ పెట్టే లక్ష్యంతో ఏకంగా రెండు పార్టీలపై దాడిని ముమ్మరం చేశారు. దీంతో తెలంగాణలో రాజకీయం వేడెక్కింది. .

# యూజర్‌నేమ్ ఫీచర్‌పై వాట్సాప్ క్లారిటీ

- ఇంకా అమల్లోకి రాలేదు.. దశలవారీగా అందుబాటులోకి
- యూజర్‌నేమ్ ఉన్నా మొబైల్ నంబర్ తప్పనిసరే
- కేంద్రం ఆందోళనలకు మెటా సంస్థ వివరణ




**న్యూఢిల్లీ, జూలై 2:** వాట్సాప్‌లో ప్రవేశపెట్టనున్న యూజర్‌నేమ్ ఫీచర్‌పై కేంద్ర ప్రభుత్వం వ్యక్తం చేసిన అభ్యంతరాల నేపథ్యంలో మెటా సంస్థకు చెందిన వాట్సాప్ కీలక వివరణ ఇచ్చింది. ప్రస్తుతం ఈ ఫీచర్‌ను వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురాలేదని, కేవలం యూజర్‌నేమ్‌ను ముందస్తుగా రిజర్వ్ చేసుకునే అవకాశమే కల్పించామని స్పష్టం చేసింది. ఈ ఏడాది చివరి నాటికి దశలవారీగా ఈ ఫీచర్‌ను అమల్లోకి తీసుకురానున్నట్లు వెల్లడించింది. యూజర్‌నేమ్ ఫీచర్ ద్వారా కొత్త వ్యక్తులు లేదా గ్రూపులతో మొబైల్ నంబర్‌ను వెల్లడించకుండా సంభాషించే అవకాశం ఉంటుందని వాట్సాప్ తెలిపింది. అయితే ఈ ఫీచర్‌ను ఉపయోగించడం పూర్తిగా వినియోగదారుల ఇష్టమని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా యూజర్‌నేమ్ సృష్టించాల్సిన అవసరం లేదని పేర్కొంది. వాట్సాప్ సేవలను ఉపయోగించేందుకు మొబైల్ నంబర్ మాత్రం ఎప్పటికీ తప్పనిసరిగా కొనసాగుతుందని స్పష్టం చేసింది. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లో ఇప్పటికే ఉన్న యూజర్‌నేమ్‌లను ఆయా ఖాతాదారుల కోసం రిజర్వ్ చేస్తామని, ప్రముఖులు, ప్రభుత్వ సంస్థలు, సెలబ్రిటీలు, ధ్రువీకరించబడిన ఖాతాలకు సంబంధించిన పేర్లు దుర్వినియోగం కాకుండా ప్రత్యేక రక్షణ కల్పిస్తామని తెలిపింది. ఒకవేళ కోరుకున్న పేరు ఇప్పటికే వినియోగంలో ఉంటే ప్రత్యామ్నాయ యూజర్‌నేమ్‌లను సూచించే ప్రత్యేక వ్యవస్థను అందుబాటులో ఉంచనున్నట్లు వివరించింది. యూజర్-నేమ్‌లను నేరుగా వెతికే అవకాశం ఉండదని వాట్సాప్ స్పష్టం చేసింది. కొత్త వ్యక్తి నుంచి సందేశం వచ్చినప్పుడు అతని దేశం, ఖాతా వివరాలు, భద్రతా హెచ్చరికలు వంటి సమాచారం చూపించే విధంగా వ్యవస్థను రూపొందిస్తున్నట్లు తెలిపింది. ఇప్పటికే అమల్లో ఉన్న బ్లాక్, రిపోర్ట్ వంటి భద్రతా సదుపాయాలు కొనసాగుతాయని పేర్కొంది. అదనపు భద్రత కోసం యూజర్‌నేమ్ కీ అనే కొత్త వ్యవస్థను కూడా ప్రవేశపెడుతున్నట్లు వెల్లడించింది. దీనిని వినియోగదారులు అవసరమైతే ఎప్పుడైనా మార్చుకునే అవకాశం ఉంటుందని తెలిపింది. యూజర్‌నేమ్ ఫీచర్ కారణంగా నకిలీ గుర్తింపులు, డిజిటల్ అరెస్ట్ మోసాలు, ఆర్థిక మోసాలు పెరిగే అవకాశం ఉందని కేంద్ర ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది. ప్రభుత్వ అధికారులు, ఆర్థిక సంస్థలు, ప్రజాప్రతినిధుల పేర్లను పోలిన యూజర్‌నేమ్‌ల దుర్వినియోగాన్ని అరికట్టే వరకు ఈ ఫీచర్‌ను అమలు చేయవద్దని వాట్సాప్‌కు సూచించింది. అలాగే భద్రతా చర్యలపై మూడు రోజుల్లో పూర్తి నివేదిక సమర్పించాలని నోటీసు జారీ చేసింది. దీనికి స్పందించిన వాట్సాప్, ప్రస్తుతం యూజర్‌నేమ్ ఆధారిత మెసేజింగ్ సేవ ప్రారంభం కాలేదని, భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ అన్ని రక్షణ చర్యలతోనే ఈ ఫీచర్‌ను అందుబాటులోకి తీసుకువస్తామని స్పష్టం చేసింది.




# అమర్‌నాథ్ యాత్ర ప్రారంభం

**తొలి బృందానికి చందర్‌కోట్ వద్ద స్వాగతం**

**శ్రీనగర్, జూలై 2:** హిమాలయాల్లో వెలిసిన పవిత్ర అమర్‌నాథ్ హిమలింగ దర్శన యాత్ర ప్రారంభమైంది. క్షేత్ర దర్శనానికి బాల్తాల్ రూట్ లో వెళ్తున్న భక్తుల తొలి బృందానికి జమ్ము-శ్రీనగర్ జాతీయ రహదారిపై ఉన్న చందర్‌కోట్ వద్ద ఘన స్వాగతం లభించింది. రాంబన్ జిల్లా యంత్రాంగం, సివిల్ సొసైటీ సభ్యులు, వివిధ సంస్థలు భక్తులకు ఆత్మీయ ఆతిథ్యంతో స్వాగతం పలికాయి. అంతకుముందు, జమ్మూలోని భగవతీ నగర్ బేస్ క్యాంప్ నుంచి లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఈ వార్షిక యాత్ర కాన్వాయ్‌ను జెండా ఊపి ప్రారంభించారు. భక్తులను స్వాగతించిన వారిలో డీఐజీ సర్గున్ శుక్లా, రాంబన్ డిప్యూటీ కమిషనర్ మహమ్మద్ అలియాస్ ఖాన్, ఎస్ఎస్పీ అరుణ్ గుప్తా, ట్రాఫిక్ ఎస్ఎస్పీ రాజా ఆదిల్ హమీద్ సహా పలువురు ఉన్నతాధికారులు ఉన్నారు. తర్వాత, భక్తులు బస చేసే మొదటి ప్రధాన కేంద్రం చందర్‌కోట్. ఈ పవిత్ర యాత్ర సాఫీగా, సురక్షితంగా సాగేందుకు జిల్లా యంత్రాంగం అన్ని రకాల చర్యలు చేపట్టింది. చందర్‌కోట్ లంగర్ సైట్ వద్ద భక్తులకు అవసరమైన వసతులు, భోజన సదుపాయాలను సిద్ధం చేశారు.

# అయోధ్య విరాళాల వివాదంలో మరో మలుపు!


- చంపత్ రాయ్‌పై పోలీసులకు ఫిర్యాదు
- అనిల్ మిశ్రా సహా నలుగురిపై కేసు నమోదు చేయాలని న్యాయవాదుల డిమాండ్
- జులై 6న ట్రస్ట్ అత్యవసర సమావేశం..
- కీలక నిర్ణయాలపై ఉత్కంఠ



**అయోధ్య, జులై 2 :** అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌లో విరాళాల దుర్వినియోగం వ్యవహారం మరింత ముదురుతోంది. ఇప్పటికే ట్రస్ట్ జనరల్ సెక్రటరీ చంపత్ రాయ్, ట్రస్టీ అనిల్ మిశ్రా తమ పదవులకు రాజీనామా చేసిన నేపథ్యంలో గురువారం కీలక పరిణామం చోటుచేసుకుంది. ది బార్ అసోసియేషన్ ఆఫ్ ఫైజాబాద్ తరఫున న్యాయవాదులు చంపత్ రాయ్‌తో పాటు అనిల్ మిశ్రా, కృష్ణ దేవ్, గోపాల్ రావ్‌లపై అయోధ్యలోని రామజన్మభూమి పోలీస్ స్టేషన్‌లో లిఖితపూ-ర్వక ఫిర్యాదు చేశారు. ఫైజాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాళికా శరణ్ మిశ్రా మాట్లాడుతూ, నిందితులపై వెంటనే కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరామని తెలిపారు. ఫిర్యాదు స్వీకరణకు సంబంధించిన కాపీ ఇవ్వకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అయితే రామమందిరం విరాళాల వ్యవహారంలో దర్యాప్తు కొనసాగుతోందని, నిందితులపై తగిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. విరాళాల లెక్కింపులో అక్రమాలు జరిగాయంటూ సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ చేసిన ఆరోపణల నేపథ్యంలో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేసింది. అనంతరం పలువురిపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేయగా, విరాళాల లెక్కింపు ప్రక్రియలో పాల్గొన్న ఎనిమిది మంది ఉద్యోగులను పోలీసులు ఇప్పటికే అరెస్టు చేశారు. దర్యాప్తులో భాగంగా చంపత్ రాయ్ వాంగ్మూలాన్ని కూడా సిట్ అధికారులు నమోదు చేశారు. ఇక జులై 6న అయోధ్యలో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ అత్యవసర సమావేశం నిర్వహించనుంది. ఈ సమావేశంలో రెండు మూడొంతుల మెజారిటీతో చంపత్ రాయ్, అనిల్ మిశ్రాల భవితవ్యంపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. సిట్ నివేదిక ఆధారంగా ట్రస్ట్ నిర్వహణలో కీలక మార్పులు చోటుచేసుకునే అవకాశముందని సమాచారం.

# జపాన్ ప్రధాని నా అందమైన చెల్లెలు

- మోదీ ఆప్యాయతకు తకాయిచీ ఫిదా
- భారత్-జపాన్ బంధానికి కొత్త ఊపు
- రూ.6 లక్షల కోట్ల పెట్టుబడులే లక్ష్యం
- ఫార్మా, రక్షణ, కృత్రిమ మేధస్సు రంగాల్లో కీలక ఒప్పందాలు



**న్యూఢిల్లీ, జులై 3 :** భారత ప్రధాని నరేంద్ర మోదీ, జపాన్ ప్రధాని సనాయె తకాయిచీకి ఆత్మీయ స్వాగతం పలికారు. ఢిల్లీలో జరిగిన ద్వైపాక్షిక సమావేశంలో తకాయిచీని ఉద్దేశించి "నా అందమైన చెల్లెలు" అని సంబోధించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మోదీ చూపిన ఆప్యాయతకు చిరునవ్వుతో స్పందించిన తకాయిచీ, తనను "అందమైన చెల్లెలు"గా సంబోధించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. భారత్--జపాన్ 16వ వార్షిక శిఖరాగ్ర సమావేశంలో ఇరు దేశాలు వ్యాపారం, రక్షణ, ఔషధ తయారీ, కృత్రిమ మేధస్సు, పెట్టుబడులు తదితర కీలక రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించేందుకు ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. వచ్చే పదేళ్లలో సుమారు రూ. 6 లక్షల కోట్ల పెట్టుబడులను లక్ష్యంగా పెట్టుకుని ముందుకు సాగాలని నిర్ణయించాయి. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, భారత్‌ను తొలిసారిగా అధికారికంగా సందర్శిస్తున్న జపాన్ తొలి మహిళా ప్రధాని సనాయె తకాయిచీకి స్వాగతం పలకడం ఆనందంగా ఉందన్నారు. ఆమె దూరదృష్టి కలిగిన నాయకురాలని ప్రశంసించారు. ఇరు దేశాల ప్రత్యేక వ్యూహాత్మక, ప్రపంచ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ఈ సమావేశం కీలకమని పేర్కొన్నారు. మూడు రోజుల పర్యటన కోసం బుధవారం భారత్‌కు చేరుకున్న తకాయిచీ, ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ప్రధాని మోదీతో విస్తృత స్థాయి చర్చలు జరిపారు. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, సాంకేతికత, ఇండో-పసిఫిక్ ప్రాంతంలో భద్రత, ప్రాంతీయ సహకారం వంటి అంశాలపై ఇరు దేశాల నాయకులు అభిప్రాయాలు పంచుకున్నారు. భారత్ చేరుకున్న అనంతరం తకాయిచీ తన పర్యటనకు సంబంధించిన చిత్రాలను సామాజిక మాధ్యమంలో పంచుకోగా, ప్రధాని మోదీ స్పందిస్తూ ఆమెకు హృదయపూర్వక స్వాగతం పలికారు. భారత్-జపాన్ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి ఈ సమావేశం కొత్త దిశను చూపుతుందని, ఉమ్మడి కృషితో ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం, సమృద్ధిని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలి

**వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ**



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** ఎస్ ఐ ఆర్ ప్రక్రియను సమర్ధవంతంగా నిర్వహించాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి తెలిపారు. గురువారం మోమిన్ పేట్ మండల 75 వార్డులో స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ ఇంటింటి సర్వే తీరును క్షేత్ర స్థాయిలో జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ పరిశీలించారు. ఎన్ని ఫారాలు ఇచ్చారు, కుటుంబంలో ఎంత మంది ఓటర్లు ఉన్నారు, కుటుంబ సభ్యులు ఒకే పి ఎస్ లో ఉన్నారా, కుటుంబ సభ్యులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్యూమరేషన్ ఫారాలు బిఎల్ఓ ప్రతి ఇంటికి తిరిగి అందించాలని కలెక్టర్ తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. ఉర్దూ మాట్లాడే ప్రజలు ఉన్న చోట ఉర్దూ ఫారాలు వారికీ అందజేయాలని ఎలాంటి పొరపాట్లు లేకుండా సర్ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. ఓటర్ జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, సమర్ధవంతంగా నిర్వహించాలని ఆయన బిఎల్ఓ లకు సూచించారు. ఎన్యూమరేషన్ ఫారంలో తప్పులు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత బిఎల్ఓలదేనని కలెక్టర్ తెలిపారు. ప్రజలు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములై తమ వివరాలను సరిచూసుకోవాలని కలెక్టర్ సూచించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు గర్ల్స్ , బాయ్స్, ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం సంబంధించిన వంటకాలను పరిశీలించారు. కిచెన్ షెడ్, ఆహార పదార్థాలను పరిశీలించి, విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందించాలని అధికారులకు సూచించారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. తరగతిలో బోధన విధానాన్ని, హాజరు శాతాన్ని పరిశీలించారు. మోమిన్ పేట్ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించేందుకు వైద్యాధికారులు చిత్తశుద్ధితో పని చేయలన్నారు. ఆసుపత్రిలో కావలసిన మందులు ఎప్పుడూ అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. ఆసుపత్రిలో సౌకర్యాలపై ఆసుపత్రికి వచ్చిన రోగులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు పట్టిక, ఇన్ పేషెంట్ వార్డు, వార్డు గదులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ మున్నిరుద్దీన్, సివిల్ సర్జన్ బుచ్చి బాబు, ఎం పి డి ఓ రాజ మల్లయ్య, సర్పంచ్ సంధ్య, సుభాష్ గౌడ్, డిప్యూటీ తాసిల్దార్ గోవర్ధన్ గౌడ్, సురేష్, బి ఎల్ ఓ లు, పాఠశాల ప్రదానోపద్యాయులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఆయిల్ ఫామ్ పంటలపై ప్రజలకు అవగాహన కల్పించాలి




- సాంకేతిక సలహాలు అవసరమైన మార్గదర్శకాలు సూచించాలి
- వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి

**వికారాబాద్, రాజముద్ర న్యూస్:** ఆయిల్ పామ్ పంటలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్దీపక్ తివారి అన్నారు. గురువారము జిల్లాలో ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు రైతులకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో వ్యవసాయం, ఉద్యానవన శాఖ, ఆయిల్ పామ్ సంస్థ ప్రతినిధులు, సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగు వల్ల రైతులకు లభించే ప్రయోజనాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, సాగు విధానాలు, మార్కెటింగ్ సౌకర్యాలు, కొనుగోలు విధానం వంటి అంశాలపై గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఆసక్తి ఉన్న రైతులను గుర్తించి, వారికి సాంకేతిక సలహాలు, అవసరమైన మార్గదర్శకాలు అందించాలని తెలిపారు. రైతు ఆయిల్ ఫామ్ క్షేత్ర సందర్శన, ఆయిల్ ఫామ్ కంపెని సందర్శన చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను అర్హులైన రైతులకు పూర్తిస్థాయిలో చేరేలా చర్యలు తీసుకోవాలని, సాగు విస్తీర్ణం పెంచేందుకు శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. రైతుల సందేహాలను నివృత్తి చేస్తూ ఆయిల్ పామ్ సాగులో విజయవంతమైన రైతుల అనుభవాలను ఇతర రైతులకు పరిచయం చేసే కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, ట్రిని కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టూర్, ఉద్యాన వన శాఖ అధికారి సత్తార్, సంబంధిత శాఖల అధికారులు, ఆయిల్ పామ్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# కప్పాస్ కాంతి పథకం ద్వారా 100% సబ్సిడీపై అధిక దిగుబడి పత్తి విత్తనాల పంపిణీ....

**మండల వ్యవసాయ అధికారి నా రెడ్డి సీతారాం రెడ్డి**



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** తిరుమలాయపాలెం మండలం: రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఆదాయాన్ని పెంచడం, అధిక దిగుబడులు సాధించే లక్ష్యంతో అమలు చేస్తున్న కప్పాస్ కాంతి పథకం కింద తిరుమలాయపాలెం మండల రైతు వేదికలో రైతులకు 100 శాతం సబ్సిడీపై అధిక ఉత్పాదక పత్తి విత్తనాల ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి నా రెడ్డి సీతారాం రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని నాణ్యమైన విత్తనాలతో పత్తి సాగు చేపట్టాలని సూచించారు. శాస్త్రీయ పద్ధతులను అనుసరించడం ద్వారా అధిక దిగుబడులు సాధించి, సాగు ఖర్చులు తగ్గించుకోవచ్చని తెలిపారు. పథకం ద్వారా అర్హులైన రైతులకు పూర్తిగా ఉచితంగా పత్తి విత్తనాలను అందిస్తున్నామని, రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటిస్తూ పంట నిర్వహణ చేపట్టాలని కోరారు. రైతులు పంటలో సమతుల్య ఎరువుల వినియోగం, సమయానికి కలుపు నివారణ, చీడపీడల నియంత్రణ చర్యలు చేపట్టడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, రైతు వేదిక సభ్యులు, పలువురు రైతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నారెడ్డి సీతారాం రెడ్డి, మేడిద పల్లి గ్రామ సర్పంచ్ మోర అనిల్ రెడ్డి, తిరుమలాయపాలెం సర్పంచ్ ధరావత్ సుజాత నరసింహారావు, మండల ఏఈవోలు, రైతులు, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు

# వికారాబాద్ పట్టణంలో విస్తృత ప్రత్యేక తనిఖీలు




- గంజాయి వాహనాల స్వాధీనం
- ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యం

**వికారాబాద్, రాజముద్ర న్యూస్:** వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు వికారాబాద్ డీఎస్పీ పర్యవేక్షణలో బుధవారం రాత్రి వికారాబాద్ పట్టణంలోని రైల్వే స్టేషన్, బస్ స్టాండ్, నిర్మానుష్య ప్రాంతాలు, రాత్రి వేళల్లో తెరిచి ఉన్న దుకాణాలు తదితర ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించబడినాయి. ఈ తనిఖీలలో వికారాబాద్ టౌన్ ఇన్స్పెక్టర్ రఘు కుమార్, ఐదుగురు సబ్-ఇన్స్పెక్టర్లు, పోలీసు సిబ్బంది, క్విక్ రెస్పాన్స్ టీమ్ సభ్యులు పాల్గొని పాపులన్ డివైస్ సహాయంతో అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. తనిఖీల సందర్భంగా బస్ స్టాండ్ సమీపంలో సుమారు 15 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకొని, సంబంధిత వ్యక్తిపై చట్టపరమైన చర్యలు ప్రారంభించారు. వాహనాలకు సంబంధించిన చెల్లుబాటు అయ్యే పత్రాలను చూపించలేకపోయిన ఎనిమిది ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకుని, మోటార్ వాహనాల చట్టం ప్రకారం కేసులు నమోదు చేశారు. ఈ ప్రత్యేక తనిఖీల ద్వారా నేరచరిత్ర కలిగిన వ్యక్తులు, అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచడంతో పాటు, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడం, మాదకద్రవ్యాల రవాణా వినియోగాన్ని నియంత్రించడం, దొంగతనాలు, ఇతర నేరాలను నివారించడం, ప్రజలకు సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడం లక్ష్యంగా చర్యలు చేపట్టడం జరిగింది అని వికారాబాద్ డీఎస్పీ అంజయ్య తెలిపినారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు వికారాబాద్ సబ్ డివిజన్ పోలీసులు నిరంతరం కట్టుబడి పనిచేస్తున్నారని, ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండి అనుమానాస్పద వ్యక్తులు, చట్టవ్యతిరేక కార్యకలాపాల గురించి వెంటనే సమీప పోలీసు స్టేషన్‌కు లేదా డయల్-100కు సమాచారం అందించాలని తెలిపినారు. ప్రజల సహకారంతోనే నేరాలను సమర్థవంతంగా అరికట్టడం సాధ్యమవుతుందని డీఎస్పీ అంజయ్య తెలిపారు.

# మండ్రాజుపల్లి కొత్తూరు రామాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవం

**ప్రత్యేక పూజలు చేసిన మంత్రి పొంగులేటి క్యాంపు ఇన్‌ఛార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి**



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి, నేలకొండపల్లి మండలం మండ్రాజుపల్లి కొత్తూరులోని శ్రీ రామాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌ఛార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొడాలి గోవింద రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం తుంబూరు దయాకర్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, పాడి పంటలతో కళకళలాడాలని దేవుడిని వేడుకున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, నాయకులు నెల్లూరి భద్రయ్య, వజ్జా శ్రీను, నంబూరి రామారావు, సర్పంచ్ లావూరి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

# పీఆర్సీ వెంటనే ప్రకటించాలి

- పెండింగ్ డీఏ, జీపీఎఫ్ బకాయిలపై పీఆర్‌టీయూ అల్టిమేటం
- సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరించాలి: కూసుమంచిలో సభ్యత్వ నమోదు కార్యక్రమం



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** కూసుమంచి:రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పీఆర్సీని ప్రకటించాలని, పెండింగ్ డీఏలను, జీపీఎఫ్ బకాయిలను తక్షణమే చెల్లించాలని పీఆర్‌టీయూ కూసుమంచి మండల శాఖ డిమాండ్ చేసింది. మంగళవారం మండల శాఖ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు, జనరల్ ఫండ్ క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు ఎస్. ఆంజనేయులు, మాట్లాడుతూ, ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారంలో పీఆర్‌టీయూ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పీఆర్సీని ప్రకటించాలి. పెండింగ్ డీఏలను విడుదల చేయాలి. జీపీఎఫ్ పెండింగ్ బకాయిలను తక్షణమే చెల్లించాలి. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి. ఉద్యోగులందరికీ హెల్త్ కార్డులు వెంటనే జారీ చేసి అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో నగదు రహిత వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలి. ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను ఇదే విధంగా నిర్లక్ష్యం చేస్తే పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శులు,ఎ. లక్ష్మీనారాయణ, కె. అనంత్, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ పి. సోమయ్య,బి.పాపారావు, సిహెచ్. మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

# రావిగూడెం ఉపాధ్యాయుడి కుమార్తె వివాహ వేడుకకు హాజరైన యూత్ కాంగ్రెస్ నేతలు

**నేలకొండపల్లి శ్రీకర గార్డెన్స్‌లో వధూవరులను ఆశీర్వదించిన నేతలు**



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి, ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గం నేలకొండపల్లి మండల కేంద్రంలోని శ్రీకర గార్డెన్స్‌లో రావిగూడెం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు సుంతరమోని నాగార్జున - సరళాదేవి దంపతుల కుమార్తె వివాహ వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ వేడుకకు ఖమ్మం జిల్లా అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు, తెలంగాణ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి జక్రిపోతుల అంజని, నేలకొండపల్లి మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు గొలుసు పవన్, పాలేరు నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ మనబోయిన సాయి నవీన్, యూత్ కాంగ్రెస్ నాయకులు మనోజ్ నాయక్, గ్రామ పెద్దలు గొలుసు రామయ్య తదితరులు హాజరయ్యారు. నాయకులు వధూవరులకు శుభాకాంక్షలు తెలిపి, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు.

# పెండింగ్ లో ఉన్న డబల్ బెడ్ రూమ్ లను వెంటనే పూర్తి చేయాలి

- నిజమైన పేదలకు ఇవ్వాలి
- పేదలకు ఇండ్లు ఇండ్ల స్థలాలు ఇవ్వకుంటే మేమే పంపిణీ చేస్తాం
- సిపిఎం వికారాబాద్ జిల్లా కమిటీ డిమాండ్



**వికారాబాద్, రాజముద్ర న్యూస్:** గురువారం సిపిఎం వికారాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వికారాబాద్ జిల్లా కేంద్రంలో పెండింగ్ లో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లును సందర్శించరు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యులు మాట్లాడుతూ 10 సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న డబల్ బెడ్ రూమ్ లను పూర్తిచేసి నిరుపేదలకు పంచాలని, ఇందిరమ్మ ఇండ్లు ఇండ్ల స్థలాలు ఇవ్వాలి అన్నారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలో అనేక ఏండ్లుగా నివశిస్తున్న నిరుపేదలకు ఇండ్లు ఇండ్ల స్థలాలు లేని కారణంగా నిజమైన పేదలకు గుర్తించి తక్షణం ఇండ్లు ఇవ్వాలని పేర్కొన్నారు. గతంలో ఇచిన సర్టిఫికెట్ ఉన్నవారికి సర్వే నంబర్ 244,190, 290, ఇండ్ల పట్టాలు ఇవ్వాలని లేనిచో భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పేదాలను సమీకరించి మేమే ఇళ్ల స్థలాలు పంచుతామన్నారు. ప్రభుత్వం వెంటనే తగు చర్యలు చేపట్టాలి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఆర్ మహిపాల్, జిల్లా కమిటీ సభ్యులు సతీష్ సుదర్శన్ , గోపాల్ రెడ్డి, రైతు సంఘం నాయకులు కేవీపీఎస్, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు తేజా, అజీమ్ ఖాన్, నాసిర్, గాఫ్ఫూహార్ అనంతయ్య, రాములు, రాజు, అనసూయ, కమిలి బాయ్ శ్యామయ్య,, కుమార్, అరుణ, శ్రీనివాస్, కిష్టప్ప, రాజేందర్, శ్రీకాంత్, బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

# అటవీ సంరక్షణలో డీఎఫ్ఓ ప్రశాంత్ ముద్ర

**మూడేళ్లలో విశేష విజయాలు.. నిజామాబాద్కు బదిలీ**

**జిల్లాలో మూడు పులుల సంచారం గుర్తింపు**



**రాజముద్ర న్యూస్, ఆదిలాబాద్:** ఆదిలాబాద్ జిల్లా అటవీ శాఖాధికారి (డీఎఫ్ఓ) ప్రశాంత్ బాజీరావు పాటిల్ నిజామాబాద్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన తన మూడేళ్ల పదవీ కాలంలో జిల్లాలో చేపట్టిన అటవీ సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, ఎకో టూరిజం అభివృద్ధి కార్యక్రమాల గురించి 'ఉద్యమ కెరటం'తో ప్రత్యేకంగా మాట్లాడారు. తన హయాంలో అటవీ ప్రాంతాల్లోని 15 ఆదివాసీ గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించడంలో కీలకపాత్ర పోషించినట్లు తెలిపారు. ఆక్రమణకు గురైన 1,250 ఎకరాల ప్రభుత్వ భూమిని తిరిగి స్వాధీనం చేసుకుని అక్కడ విస్తృతంగా మొక్కలు నాటించినట్లు చెప్పారు. దశాబ్ద కాలంగా పెండింగ్లో ఉన్న సుమారు 200 కిలో మీటర్ల ఎవెన్యూ ప్లాంటేషన్ పనులను పూర్తి చేసినట్లు వివరించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలైన పొచ్చెర, కుంటాల జలపాతాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.5కోట్ల నిధులు మంజూరు చేయించామని తెలిపారు. ఉట్నూర్ అర్బన్ పార్కు అభివృద్ధికి రూ.2 కోట్లు, కేంద్ర ప్రభుత్వం నుంచి మరో రూ.4 కోట్ల నిధులు సాధించి యాపల్గూడ, దుర్గానగర్ పార్కులను అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు. మావల ఎకో టూరిజం పార్కును కూడా ఆకర్షణీయంగా తీర్చిదిద్దినట్లు చెప్పారు. అడవుల సంరక్షణలో భాగంగా అటవీ స్మగ్లింగ్ను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని, అటవీ నేరాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుని ప్రతి ఏడాది రూ.80లక్షల నుంచి రూ.కోటి వరకు జరిమానాలు విధించినట్లు తెలిపారు. అడవుల్లో ప్రత్యేక కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా జిల్లా పరిధిలో మూడు పులుల సంచారాన్ని అధికారికంగా గుర్తించినట్లు చెప్పారు. ఆదిలాబాద్ జిల్లా ప్రజలు, గిరిజనులు, అటవీ శాఖ సిబ్బంది అందించిన సహకారాన్ని ఎప్పటికీ మరువలేనని తెలిపారు. ఇదే అంకితభావంతో నిజామాబాద్ జిల్లాలోనూ అటవీ అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు.

# బాధలో ఉన్న కుటుంబానికి సర్పంచ్ భరోసా

**మృతుడి కుటుంబానికి రూ.3వేల ఆర్థిక సాయం**



**రాజముద్ర న్యూస్, జైనూర్:** ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలవడమే నిజమైన ప్రజాప్రతినిధి బాధ్యత అని నిరూపించారు పవర్గూడా గ్రామ సర్పంచ్ తొడసం రాజేందర్. కుటుంబ పెద్దను కోల్పోయిన బాధలో ఉన్న ఇంటికి వెళ్లి ఓదార్చడంతో పాటు ఆర్థిక సాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. జైనూర్ మండలం పవర్గూడా గ్రామానికి చెందిన మేశ్రం కళాబాయి భర్త జ్ఞానేశ్వర్ గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలుసుకున్న సర్పంచ్ ఆమె నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని వారికి మనోధైర్యం కల్పించారు. అనంతరం తనవంతు సహాయంగా రూ.3వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. అవసరమైన ప్రతి సందర్భంలో గ్రామపంచాయతీ తరఫున సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఆయన చూపిన ఆప్యాయతను గ్రామస్తులు అభినందించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, స్థానికులు కూడా మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కష్టసమయంలో పరస్పరం అండగా నిలవడం గ్రామ గొప్ప సాంప్రదాయమని వారు పేర్కొన్నారు.

# కాచిగూడ మహాసభ అధ్యక్షులకు స్వాగతం



**రామారెడ్డి రాజముద్ర న్యూస్:** హైదరాబాద్ మున్నూరు కాపు కాచిగూడ మహాసభ అధ్యక్షులు గంప చంద్రమోహన్ రామారెడ్డి మండల కేంద్రానికి అధ్యక్ష పదవి చేపట్టిన తర్వాత మొదటిసారి విచ్చేయడంతో కులబంధువుల నుంచి అపూర్వ స్వాగతం లభించింది.ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ఇస్సన్నపల్లి గ్రామంలోగల ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ కాలభైరవ స్వామి ఆలయాన్ని గురువారం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కలు చెల్లించుకున్నారు.అనంతరం రామారెడ్డి మండల మున్నూరు కాపు సంఘ భవనం ప్యాట్లబేడాలో ఏర్పాటు చేసిన సన్మాన సభలో పాల్గొన్నారు.మహాసభ అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా మండల కేంద్రానికి విచ్చేసిన గంప చంద్రమోహన్‌ను,మండల అధ్యక్షులు కడెం శ్రీకాంత్,ప్రధాన కార్యదర్శి కాలా హనుమాన్లు ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు.ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా హాజరైన రామారెడ్డి సర్పంచ్ బండి ప్రవీణ్ ఆయనను శాలువా,పూలమాలతో సన్మానించి,జ్ఞాపికను అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మహాసభ అధ్యక్షులు తో పాటు మ్యారేజ్ బ్యూరో చైర్మన్ గోపాల రాధాకృష్ణ,క్యాషియర్ శ్రీ అనంతుల ప్రహ్లాద్ కన్వీనర్ శ్రీ కొమ్మ శ్రీనివాస్ పాల్గొన్నారు.పరిచయాల అనంతరం ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.కన్వీనర్ కొమ్మ శ్రీనివాస్ జిల్లా మున్నూరు కాపు సంఘ భవన నిర్మాణానికి తన వంతు సహకారంగా రూ.25,000 చెక్కును అందజేశారు.అదేవిధంగా మహాసభ అధ్యక్షులు గంప చంద్రమోహన్ మున్నూరు కాపు సంఘ కార్యకలాపాలకు తోడ్పాటుగా ప్రతి మండల సంఘానికి రూ.10,000 చొప్పున సహాయ నిధిని అందజేస్తున్నట్లు ప్రకటించారు.ఈ మేరకు రామారెడ్డి మండల అధ్యక్షులు కడెం శ్రీకాంత్‌కు నగదును అందించారు. అందరం కలిసికట్టుగా కులాభివృద్ధికి కృషి చేస్తామని నేతలు ఏకకంఠంతో తీర్మానించారు.ఈ కార్యక్రమంలో మహాసభ టీసీ మెంబర్ తోట భూమయ్య కామారెడ్డి జిల్లా మున్నూరు కాపు అధ్యక్షులు ఆకుల శ్రీనివాస్,ప్రధాన కార్యదర్శి పెట్టిగారి అంజయ్య,మండల కమిటీ సభ్యులు బండారి శేఖర్, పైడాకుల రాజేందర్,మండలంలోని వివిధ గ్రామాల కుల పెద్దలు,గ్రామ సదర్ సంఘం అధ్యక్షులు తోట రాములు కమిటీ సభ్యులు,వీరితో పాటు గ్రామస్తులు,హనుమాయల రాజయ్య,బాల్దేవ్ అంజయ్య, లక్కాకుల శేఖర్, నర్సింలు,గాండ్ల నర్సింలు,నడిపి రాజయ్య, లింబాద్రి,కడెం భైరయ్య,కడెం రాజు, కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేశారు.

# సమాజానికి దిక్సూచిలాంటి పుస్తకాలు రావాలి

- తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి



**రాజముద్ర న్యూస్, హైదరాబాద్:** సమాజంలో ఆలోచనలను రేకెత్తించే, సరికొత్త దృక్పథాలను ఆవిష్కరించే దిక్సూచిలాంటి పుస్తకాలు మరిన్ని రావాలని తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి ఆకాంక్షించారు. హైదరాబాద్‌లోని మీడియా అకాడమీ కార్యాలయంలో 'నేటి నిజం' పత్రిక ప్రచురించిన "ఆలోచన ఆవిష్కరణ" పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కె. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పత్రికా రంగంతో పాటు సాహిత్య, సామాజిక రంగాలకు 'నేటి నిజం' అందిస్తున్న సేవలను కొనియాడారు. సమాజ హితం కోరే ఇటువంటి ప్రచురణలు పాఠకులకు ఎంతో జ్ఞానాన్ని అందిస్తాయని పేర్కొన్నారు. 'నేటి నిజం' యాజమాన్యం సమాజానికి ఉపయోగపడే మంచి పుస్తకాన్ని ప్రచురించి, పాఠకులకు అందించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి, నేటి నిజం మేనేజింగ్ డైరెక్టర్ బైసా వీణాదాస్, నేటి నిజం ఎడిటర్ బైసా దేవదాస్, టుడే ఫ్రీడమ్ ఎడిటర్ ఆజం ఖాన్ పాల్గొన్నారు.

# నాలుగో రోజుకు చేరిన సింగరేణి అధికారుల రిలే నిరాహార దీక్షలు



**రాజముద్ర న్యూస్, సత్తుపల్లి:** సింగరేణి అధికారుల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భారత బొగ్గు గనుల అధికారుల సంఘం (సీఎంఓఏఐ) సింగరేణి శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం సత్తుపల్లి సింగరేణి ప్రాంతంలో నాలుగో రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరంలో పాల్గొన్న అధికారులకు తోటి అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పెద్ద ఎత్తున సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ సింగరేణి సంస్థ అభివృద్ధికి రాత్రింబవళ్లు కృషి చేస్తున్న అధికారుల పట్ల యాజమాన్యం, ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని వీడి న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని కోరారు. అధికారుల ప్రధాన డిమాండ్లలో పనితీరు ఆధారిత ప్రోత్సాహక వేతనం (పీఆర్పీ) బకాయిలను వెంటనే విడుదల చేయడం, పెండింగ్లో ఉన్న వేతనాల ఉన్నతీకరణను అమలు చేయడం ప్రధానమైనవని తెలిపారు. ఈ అంశాలపై పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల సమస్యలు పరిష్కారం కాకపోతే సంస్థ పనితీరుపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. సింగరేణి అభివృద్ధిలో అధికారుల సేవలు కీలకమైనవని, వారి సమస్యలను పరిష్కరించడం యాజమాన్యం బాధ్యత అని స్పష్టం చేశారు. ఈనెల 13 వరకు రిలే నిరాహార దీక్షలు నిరంతరాయంగా కొనసాగుతాయని, అప్పటికీ యాజమాన్యం స్పందించని పక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి తదుపరి కార్యాచరణను ప్రకటిస్తామని స్పష్టం చేశారు. అధికారుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించి సింగరేణి సంస్థలో సానుకూల వాతావరణం నెలకొల్పాలని ప్రభుత్వం, యాజమాన్యాన్ని కోరారు.

# అభ్యాసన సామర్థ్యాల పెంపునకు అధ్యాపకులు కృషి చేయాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



**రాజముద్ర న్యూస్,ఆదిలాబాద్:** విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలను పెంపొందించేందుకు, తరగతి గదుల్లో వారిని క్రియాశీలకంగా ఉంచేందుకు అధ్యాపకులు నిరంతరం కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని డీఐఈఓ కార్యాలయంలో ఫిజిక్స్ లెక్చరర్ల కు నిర్వహించిన ప్రత్యేక ఓరియంటేషన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేవలం సిలబస్ పూర్తి చేయడం మాత్రమే కాకుండా, విద్యార్థులకు సబ్జెక్టులపై స్పష్టత వచ్చేలా బోధనా పద్ధతుల్లో మార్పులు తీసుకురావాలని సూచించారు. ఇంగ్లీష్ మీడియం విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించడంతో పాటు, అధ్యాపకులు తమ కమ్యూనికేషన్ స్కిల్స్ను మెరుగుపర్చుకోవాలని సూచించారు. కళాశాలల్లో నూతన పాఠ్యపుస్తకాల లభ్యతను పరిశీలించి, ఎక్కడైనా కొరత ఉంటే వెంటనే ప్రిన్సిపాల్, డీఐఈఓల దృష్టికి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. సైన్స్ సబ్జెక్టుల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ వినియోగాన్ని పెంచాలని, ఆన్లైన్ ప్లాట్ఫారమ్ల ద్వారా లభించే విద్యా విషయాలను తరగతి గదుల్లో ప్రాక్టీస్ చేయించాలని సూచించారు. విద్యార్థుల ప్రగతిని అంచనా వేసేందుకు ప్రతిరోజూ హోంవర్క్ ఇవ్వాలని, చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్పష్టం చేశారు. వారి ఆత్మవిశ్వాసాన్ని పెంచేందుకు సులువైన ప్రశ్నలు, ఆపై మధ్యస్థ, కఠినమైన ప్రశ్నలతో సాధన చేయించాలన్నారు. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా నెలవారీ సమీక్షలు, ఈ విద్యా సంవత్సరంలో 3 నుంచి 4 కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డీఐఈఓ జాదవ్ గణేష్ కుమార్, జిల్లా అకాడమిక్ కమిటీ సభ్యులు సూరజ్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు రమాకాంత్, తిరుపతి, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, కేజీబీవీలు, ఇతర జూనియర్ లెక్చరర్లు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పేట రోటరీ క్లబ్ సేవలకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు.

**రాజముద్ర న్యూస్, సదాశివపేట** సదాశివపేట రోటరీ క్లబ్ ప్రారంభించిన మొదటి సంవత్సరంలోనే ప్రత్యేకమైన కార్యక్రమాలు చేసి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తెచ్చుకొని అవార్డ్స్ సాధించిందని క్లబ్ అధ్యక్షులు ఓదెల ప్రభు గుప్త తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాలలో కలిపి మంచి సేవ కార్యక్రమాలను చేసిన రోటరీ క్లబ్ కి ఇచ్చే అవార్డ్స్ కార్యక్రమం శోభితం 2025-26 హైదరాబాద్ లో జరిగింది. ఇందులో సదాశివపేట రోటరీ క్లబ్ ఒక బంగారు పథకము నాలుగు వెండి పథకాలతో పాటు కాకతీయ రీజన్ లో నూతనంగా ఏర్పడ్డ క్లబ్బుల ప్రదర్శన ఆధారంగా రెండవ స్థానంలో నిలిచింది. ఇంత తక్కువ పీరియడ్ రాష్ట్రస్థాయిలో ఈ విధంగా గుర్తింపు రావడం తమకు గర్వంగా ఉందని సదాశివపేట క్లబ్ అధ్యక్షులు ఓదెల ప్రభు గుప్త తెలిపారు. క్లబ్ ఎలక్టెడ్ కార్యదర్శి మఠం రాచన్న మాట్లాడుతూ ఈ. సంవత్సర కాలంలోచేసిన పనుల గురించి తెలుపుతూ మొదటగా మెగా క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించామని, అందులో 200 కి పైన స్క్రీనింగ్ జరిగాయని, దానికోసం హైద్రాబాద్ నుండి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం తో కుండిన క్యాన్సర్ స్క్రీనింగ్ వాహనం పిసుకువచ్చి అందరికీ స్క్రీనింగ్ చేశామని తెలిపారు. ఇదే కాకుండా హెల్త్ క్యాంప్, కాలేజీ విద్యార్థులు చెడు అలవాట్ల కు బానిసలు కాకుండా ఉండడానికి వారికి అవేర్ నెస్ కోసం నిపుణులతో కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. వీటితో పాటు విద్యార్థులు ఇంటర్ తరువాత ఏ దారిలో వెళ్ళాలి,ఏది చదివితే మంచి ఉపాధి అవకాశాలు వస్తాయనే విషయంలో పారిశ్రామిక వేత్తలతో వారికి అవగాహన కల్పించడం జరిగింది. అలాగే ఈ ఎన్ టి స్క్రీనింగ్ కార్యక్రమము 100కుగా విద్యార్థులకు చేయడం జరిగింది. మన ప్రాంతంలో అతి పెద్ద కర్మాగారం అయిన మహీంద్రా కంపెనీ లో ఉద్యోగాల కోసం జాబ్ మేళాని నిర్వహించి సదాశివపేట మండలం లోని కొందరికి ఉపాధి కల్పించడం జరిగిందని తెలిపారు.వీటితోపాటు సేవా దృక్పథంతో నడపబడుతున్న సరస్వతి శిశు మందిర్ పాఠశాలకి మొయినాబాద్ క్లబ్ వారి సహకారంతో నూతన అంతస్తు నిర్మించి ఇవ్వడం.



# నయనశ్రీకి మూడు స్వర్ణాలు

**హైదరాబాద్:** తెలంగాణ స్కేటర్ తళ్లూరి నయనశ్రీ డెహ్రాడూన్‌లో జరిగిన నేషనల్ షార్ట్ ట్రాక్ స్పీడ్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌లో మూడు స్వర్ణాలు, ఒక కాంస్య పతకంతో మెరిసి వరుసగా ఐదోసారి నేషనల్ చాంపియన్‌గా నిలిచింది.మహిళల 500 మీటర్ల ఈవెంట్‌ను 49.467 సెకండ్లలో, 1000 మీటర్ల పోటీని 1 నిమిషం 47.386 సెకండ్లలో పూర్తి చేసి బంగారు పతకాలు నెగ్గిన యంగ్ స్కేటర్ జూనియర్ మహిళల 1500మీ. పోటీలోనూ అగ్రస్థానంతో స్వర్ణం అందుకుంది. 3000 మీటర్ల మిక్స్‌డ్ రిలే ఈవెంట్‌లో తెలంగాణకు కాంస్యం అందించింది.

# శ్రీలంకలో టీమిండియా పర్యటన

■ ఆగస్టు 15 నుంచి టెస్టు సిరీస్

**కొలంబో:** టెస్టు సిరీస్ కోసం టీమిండియా జట్టు శ్రీలంకలో పర్యటించనున్నది. ఆగస్టు 15 నుంచి 27వ తేదీ మధ్య ఇరు జట్లు రెండు టెస్టుల్లో తలపనున్నాయి. వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్‌లో భాగంగా ఈ సిరీస్ నిర్వహిస్తున్నట్లు శ్రీలంక క్రికెట్ బోర్డు తెలిపింది. గాలేలో తొలి టెస్టు, కొలంబోలో రెండో టెస్టును వేదికగా ఫిక్స్ చేశారు. ఆగస్టు 15వ తేదీన గాలే ఇంటర్నేషనల్ స్టేడియంలో తొలి టెస్టు ప్రారంభంకానున్నది. ఆగస్టు 23వ తేదీ నుంచి కొలంబో స్టేడియంలో రెండో టెస్టు ఆడనున్నారు. గతంలో రెండు సార్లు వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ ఫైనల్స్‌లో భారత్ ఓడిన విషయం తెలిసిందే. డబ్ల్యూటీసీ టైటిల్‌ను ఇండియా గెలవలేకపోయింది. ప్రస్తుతం డబ్ల్యూటీసీ రేసులో టీమిండియా జట్టు అయిదో స్థానంలో ఉన్నది. ఆ తర్వాత శ్రీలంక ఆరో స్థానంలో ఉంది. ఇక నవంబర్-డిసెంబర్ నెలల్లో న్యూజిలాండ్‌లోనూ ఇండియా పర్యటించనున్నది. శుభమన్ గిల్ నేతృత్వంలోని భారత టెస్టు జట్టు ఇంగ్లండ్‌తో సిరీస్‌ను 2-2 తేడాతో డ్రా చేసుకున్నది. వెస్టిండీస్‌తో జరిగిన హోం సిరీస్‌ను గెలుచుకున్న




విషయం తెలిసిందే. అయితే గత ఏడాది స్వదేశీ గడ్డపై దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్టు సిరీస్‌లో భారత్ ఘోర పరాభవాన్ని చవిచూసింది. 2017లో చివరిసారి శ్రీలంకలో భారత్ పర్యటించింది. 9 ఏళ్ల గ్యాప్ తర్వాత లంకలో టీమిండియా టెస్టు సిరీస్ ఆడనున్నది. గత సిరీస్‌ను భారత్ 3-0 తేడాతో గెలుచుకున్నది.

# ఇంగ్లండ్ సిరీస్‌కు కోహ్లీ ముమ్మర సన్నద్ధత

## సంజయ్ బంగర్ పర్యవేక్షణలో ప్రత్యేక శిక్షణ

**ముంబై, జూలై 2:** భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఇంగ్లండ్‌తో జరగనున్న వన్డే సిరీస్ కోసం ముమ్మరంగా సిద్ధమవుతున్నాడు. టీమిండియా మాజీ బ్యాటింగ్ కోచ్ సంజయ్ బంగర్ పర్యవేక్షణలో కోహ్లీ ప్రత్యేకంగా నెట్ ప్రాక్టీస్ చేస్తుండగా, ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో ఇంగ్లండ్ సిరీస్‌లో కోహ్లీ రీఎంట్రీపై అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. ఈ కీలక సిరీస్ కోసం కోహ్లీ ఇప్పటికే ముంబై, అలీబాగ్‌లో ప్రత్యేక శిక్షణ శిబిరాన్ని పూర్తి చేశాడు. బ్యాటింగ్ టెక్నిక్‌లో అవసరమైన మార్పులు చేసుకుంటూ, ఫామ్‌ను మరింత మెరుగుపర్చుకునే దిశగా సాధన చేస్తున్నాడు. జూలై 14 నుంచి ప్రారంభమయ్యే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌కు ప్రకటించిన భారత జట్టులో కోహ్లీకి చోటు దక్కినప్పటికీ, తుది జట్టులో అతని ఎంపిక ఫిట్‌నెస్ క్లియరెన్స్‌పై ఆధారపడి ఉంది. టెస్టులు, టీ20 అంతర్జాతీయ క్రికెట్‌కు ఇప్పటికే వీడ్కోలు పలికిన విరాట్ కోహ్లీ ఇకపై పూర్తిగా వన్డే ఫార్మాట్‌పైనే దృష్టి సారించనున్నాడు. 2027 వన్డే ప్రపంచకప్‌ను లక్ష్యంగా పెట్టుకుని ఇప్పటి నుంచే సన్నాహాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. కోహ్లీ పునరాగమనంపై అభిమానులతో పాటు ఆయన చిన్ననాటి కోచ్ రాజ్‌కుమార్ శర్మ కూడా ఆశాభావం వ్యక్తం చేశారు. ఇంగ్లండ్ సిరీస్‌లో చివరి వన్డే మ్యాచ్‌ను లార్డ్స్ మైదానంలో ప్రత్యక్షంగా వీక్షించేందుకు ఆయన సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. కోహ్లీ నెట్ ప్రాక్టీస్ వీడియోలు ప్రస్తుతం భారత క్రికెట్ అభిమానుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతున్నాయి.





# సెరెనా, ఆండ్రీవా ఔట్

**లండన్:** నాలుగేండ్ల తర్వాత వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్‌లో రీఎంట్రీ ఇచ్చిన అమెరికా టెన్నిస్ దిగ్గజం సెరెనా విలియమ్స్‌కు షాక్ తగిలింది. తను తొలి రౌండ్‌లోనే ఓడి ఇంటిదారి పట్టగా.. ఫ్రెంచ్ ఓపెన్ చాంపియన్ మిరా ఆండ్రీవాకు రెండో రౌండ్‌లోనే ఎదురుదెబ్బ తగిలింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో ఐదో సీడ్ రష్యా స్టార్ ఆండ్రీవా 6-4, 5-7, 4-6తో బార్బోరా క్రెజికోవా (చెక్) చేతిలో పోరాడి ఓడింది. టాప్ సీడ్ సబలెంకా (బెలారస్) 6-1, 7-6 (11/9)తో కెస్లెర్ (అమెరికా)పై, నాలుగో సీడ్ పెగులా (అమెరికా) 7-6 (8/6), 6-1తో సోరిబెస్ (స్పెయిన్)పై గెలిచారు. ఏడో సీడ్ గాఫ్ (అమెరికా) 6-3, 3-6, 7-6 (10/7) తో సియెరా (అర్జెంటీనా)పై, 14వ సీడ్ ఒసాకా (జపాన్) 6-3, 6-2తో గసనోవా (రష్యా)ను ఓడించి మూడో రౌండ్ చేరారు. మంగళవారం అర్ధరాత్రి జరిగిన తొలి రౌండ్‌లో 44 ఏండ్ల సెరెనా 3-6, 7-6 (8/6), 3-6తో మాయా జాయింట్ (ఆస్ట్రేలియా) చేతిలో మూడు సెట్ల పాటు పోరాడి ఓడిపోయింది. కాగా, పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో వరల్డ్ నంబర్ వన్ సినర్ (ఇటలీ) 7-6 (7/4), 7-6 (7/2), 6-4తో నునో బోర్గెస్ (పోర్చుగల్)ను వరుస సెట్లలో ఓడించగా.. 8వ సీడ్ మెద్వెదెవ్ (రష్యా) 3-6, 6-3, 7-5, 6-2తో అగైలర్ (స్పెయిన్)పై నెగ్గాడు.

# లాస్ ఏంజిల్స్‌లో నైట్ రైడర్స్ క్రికెట్ గ్రౌండ్ ప్రారంభం



**లాస్ ఏంజిల్స్, జూలై 2:** బాలీవుడ్ సూపర్ స్టార్, కోల్‌కతా నైట్ రైడర్స్ సహ యజమాని షారుఖ్ ఖాన్ చిరకాల స్వప్నం సాకారమైంది. అమెరికాలోని లాస్ ఏంజిల్స్‌లో అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించిన 'నైట్ రైడర్స్ క్రికెట్ గ్రౌండ్' అధికారికంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా షారుఖ్ ఖాన్ ఆనందం వ్యక్తం చేస్తూ, ఇది తాను ఎప్పటినుంచో కంటున్న కల అని అన్నారు. పొమోనాలోని ఫెయిర్‌ప్లెక్స్‌లో నిర్మించిన ఈ స్టేడియంలో జూలై 1న మేజర్ లీగ్ క్రికెట్‌లో భాగంగా లాస్ ఏంజిల్స్ నైట్ రైడర్స్, వాషింగ్టన్ ఫ్రీడమ్ జట్ల మధ్య తొలి మ్యాచ్ నిర్వహించారు. దీంతో తమ సొంత దేశం వెలుపల అంతర్జాతీయ స్థాయి క్రికెట్ స్టేడియాన్ని నిర్మించిన తొలి గ్లోబల్ క్రికెట్ ఫ్రాంచైజీగా నైట్ రైడర్స్ గ్రూప్ చరిత్ర సృష్టించింది. ఈ సందర్భంగా షారుఖ్ ఖాన్ మాట్లాడుతూ, ఒకప్పుడు కలగా మొదలైన ఈ ప్రాజెక్టు నేడు నిజమైందని అన్నారు. ప్రపంచంలో అత్యధికంగా వీక్షించే రెండో క్రీడ అయిన క్రికెట్‌ను లాస్ ఏంజిల్స్‌కు తీసుకురావడం చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు. ఇది కేవలం క్రికెట్ మైదానం మాత్రమే కాదని, సమాజం, వినోదం, కుటుంబాల కోసం రూపొందించిన ప్రత్యేక వేదిక అని చెప్పారు. ఈ స్టేడియాన్ని లాస్ ఏంజిల్స్ ప్రజలకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రికెట్ అభిమానులకు అంకితం చేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు విజయవంతం కావడానికి సహకరించిన ఐసీసీ ఛైర్మన్ జై షాతో పాటు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. నైట్ రైడర్స్ స్పోర్ట్స్ సీఈఓ వెంకీ మైసూర్ మాట్లాడుతూ, ఈ స్టేడియం క్రికెట్ భవిష్యత్తుకు నిదర్శనమని అన్నారు. సుమారు 21 మిలియన్ డాలర్ల వ్యయంతో కేవలం 100 రోజుల్లోనే ఈ మైదానాన్ని నిర్మించామని వెల్లడించారు. ప్రస్తుతం 5,000 మంది ప్రేక్షకులు కూర్చునే సామర్థ్యం ఉన్న ఈ స్టేడియాన్ని, 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్ నాటికి 15,000 సీట్ల సామర్థ్యానికి విస్తరించనున్నట్లు తెలిపారు. టీ20 క్రికెట్ ఒలింపిక్స్ వేదికగా ఈ మైదానం నిలిచే అవకాశముందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఇషాన్@1



**దుబాయ్:** ఐసీసీ టీ20 బ్యాటింగ్ ర్యాంకుల్లో భారత వికెట్‌కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ అగ్రస్థానానికి చేరుకున్నాడు. సుమారు ఏడాదిపాటు ఈ స్థానంలో ఉన్న డాషింగ్ ఓపెనర్ అభిషేక్ శర్మను వెనక్కినెట్టి ఇషాన్ ఫస్ట్‌ప్లేస్‌కు దూసుకొచ్చాడు. ఈ ఏడాది ఫిబ్రవరిలో స్వదేశంలోనే జరిగిన టీ20 ప్రపంచకప్‌లో 317 రన్స్ చేసిన ఇషాన్.. 876 రేటింగ్ పాయింట్లతో మొదటి ర్యాంకును కైవసం చేసుకోగా అభిషేక్ (869) రెండో స్థానానికి పడిపోయాడు.

# హార్దిక్ ట్రేడ్‌పై సీఎస్‌కే క్లారిటీ

## ఇప్పటివరకు ఎలాంటి చర్చలు లేవు

చెన్నై, జూలై 2: ఐపీఎల్ 2026 సీజన్ అనంతరం ముంబై ఇండియన్స్ స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ట్రేడింగ్‌పై జోరుగా వినిపిస్తున్న ఊహాగానాలపై చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) స్పందించింది. హార్దిక్‌ను తమ జట్టులోకి తీసుకొచ్చే అంశంపై ఇప్పటివరకు ఎలాంటి చర్చలు జరగలేదని సీఎస్‌కే సీఈఓ కాశీ విశ్వనాథన్ స్పష్టం చేశారు. ఇటీవల హార్దిక్ పాండ్యాను దక్కించుకునేందుకు సీఎస్‌కే, కోల్‌కతా నైట్ రైడర్స్ సహా పలు ఐపీఎల్ ఫ్రాంచైజీలు ఆసక్తి చూపుతున్నాయంటూ కథనాలు వెలువడ్డాయి. అయితే ఈ ప్రచారంలో ఎలాంటి నిజం లేదని కాశీ విశ్వనాథన్ తెలిపారు. హిందుస్థాన్ టైమ్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, మేజర్ లీగ్ క్రికెట్ (ఎంఎల్‌సీ) ముగిసిన తర్వాతే జట్టుపై పూర్తి స్థాయి సమీక్ష నిర్వహిస్తామని, ఆ తర్వాతే ట్రేడింగ్ వంటి అంశాలపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ప్రస్తుతం అమెరికాలో జరుగుతున్న ఎంఎల్‌సీ టోర్నీ జూలై 18తో ముగియనుంది. ఇదిలా ఉండగా, గత మూడు సీజన్లుగా సీఎస్‌కే ప్లేఆఫ్స్‌కు చేరడంలో విఫలమవుతోంది. 2025లో చివరి స్థానంలో నిలిచిన చెన్నై, 2026లో ఎనిమిదో స్థానంతో సరిపెట్టుకుంది. దీంతో జట్టులో నాయకత్వ మార్పు అవసరమనే చర్చలు జరుగుతున్న





నేపథ్యంలో హార్దిక్ పాండ్యా పేరును పలువురు విశ్లేషకులు ప్రస్తావిస్తున్నారు. మరోవైపు, కొన్ని మీడియా కథనాల ప్రకారం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ మినహా మిగతా ఫ్రాంచైజీలు హార్దిక్‌ను తమ జట్టులోకి తీసుకునేందుకు ఆసక్తి చూపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఇప్పటివరకు ఏ ఫ్రాంచైజీ కూడా దీనిపై అధికారిక ప్రకటన చేయలేదు. ప్రస్తుతం హార్దిక్ ట్రేడింగ్ వ్యవహారం ఊహాగానాలకే పరిమితమైంది.




# లయ ఫిట్‌నెస్ సీక్రెట్

సెకండ్ ఇన్నింగ్స్‌లో వరుస అవకాశాలతో బిజీగా ఉన్న నటి లయ తన ఫిట్‌నెస్ రహస్యాలను వెల్లడించారు. ఆరోగ్యంగా ఉండాలంటే క్రమం తప్పకుండా వ్యాయామం చేయడంతో పాటు ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం ఎంతో ముఖ్యమని ఆమె సూచించారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన లయ, ఫిట్‌నెస్ అనేది కేవలం అందం కోసమే కాదని, ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి అవసరమని చెప్పారు. పెళ్లి, పిల్లల తర్వాత చాలా మంది మహిళలు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తారని, తాను కూడా ఒక దశలో అలాగే ఆలోచించానని తెలిపారు. వయసు అనేది కేవలం సంఖ్య మాత్రమేనని, శారీరకంగా చురుకుగా ఉంటే వృద్ధాప్య ప్రభావాన్ని కొంతవరకు తగ్గించవచ్చని పేర్కొన్నారు. ఫిట్‌నెస్ లేకపోతే వ్యాధులు త్వరగా వస్తాయని హెచ్చరించారు. జిమ్‌లో వ్యాయామం చేయడం కంటే ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ కోసం డ్యాన్స్ చేయడం తనకు ఎక్కువ ఉత్సాహాన్ని ఇస్తుందని లయ చెప్పారు. తన డ్యాన్స్ అకాడమీ విద్యార్థులతో కలిసి డ్యాన్స్ చేయడం వల్ల శారీరక వ్యాయామంతో పాటు మానసిక ఉల్లాసం కూడా లభిస్తుందని వివరించారు. పురుషులు, మహిళలు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని లయ సూచించారు. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, చురుకైన జీవనశైలిని అలవర్చుకోవడం వల్ల ఎక్కువకాలం ఆరోగ్యంగా, యవ్వనంగా కనిపించవచ్చని ఆమె తెలిపారు.

# దసరాకు విశ్వంభర

## సన్నాహాలు చేస్తోన్న చిత్రబృందం

మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ సోషియో-ఫాంటసీ అడ్వెంచర్ మూవీ 'విశ్వంభర' విడుదలపై ఎట్టకేలకు ఒక స్పష్టత వచ్చేసినట్లు తెలుస్తుంది. ఈ భారీ బ్జడెట్ విజువల్ వండర్ సినిమాను రాబోయే దసరా కానుకగా అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేసేందుకు చిత్రబృందం సన్నాహలు చేస్తుంది. చిరంజీవి ఎపిక్ ఫాంటసీ 'విశ్వంభర' దసరా పండుగ కానుకగా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి వస్తోంది అంటూ పలువురు మీడియా, సినీ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా పోస్ట్‌లు పెట్టడంతో దసరా రాబోతుండటం పక్కా అని తెలుస్తుంది. బ్లాకబస్టర్ హిట్ 'బింబిసార' చిత్ర దర్శకుడు వశిష్ట ఈ సినిమాను ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తుండగా, ప్రముఖ నిర్మాణ సంస్థ యువి క్రియేషన్స్ అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి ఈ చిత్రానికి అద్భుతమైన సంగీతాన్ని అందిస్తున్నారు. గతంలోనే ఈ సినిమా షూటింగ్ పూర్తయినప్పటికీ, అత్యుత్తమ అవుట్‌పుట్ కోసం భారీ విజువల్ ఎఫెక్ట్స్ మరియు గ్రాఫిక్స్ పనులపై చిత్రయూనిట్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. 'అంజి', 'జగదేకవీరుడు అతిలోకసుందరి' చిత్రాల తర్వాత చిరంజీవి నుండి వస్తున్న పూర్తి స్థాయి సోషియో-ఫాంటసీ సినిమా కావడంతో ఈ దసరాకు బాక్సాఫీస్ వద్ద మెగాస్టార్ సరికొత్త రికార్డులు సృష్టించడం ఖాయమని అభిమానులు ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు.




# త్రిష రాజకీయాల్లోకి వస్తారా?

## తిరుచ్చి ఉపఎన్నికపై జోరుగా ప్రచారం

స్టార్ హీరోయిన్ త్రిష రాజకీయ అరంగేట్రంపై తమిళనాడులో జోరుగా ప్రచారం సాగుతోంది. తిరుచ్చి అసెంబ్లీ ఉపఎన్నికలో అధికార పార్టీ తరఫున ఆమెను బరిలోకి దించే అవకాశమున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే దీనిపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ రెండు నియోజకవర్గాల్లో విజయం సాధించిన అనంతరం తిరుచ్చి స్థానానికి రాజీనామా చేయడంతో అక్కడ ఉపఎన్నిక అనివార్యమైంది. తొలుత ఈ స్థానంలో నటుడు, కొరియోగ్రాఫర్ రాఘవ లారెన్స్ పోటీ చేసే అవకాశాలున్నాయని ప్రచారం జరిగినా, ఆయన తప్పుకోవడంతో కొత్త అభ్యర్థి ఎంపికపై ఉత్కంఠ నెలకొంది. ఈ నేపథ్యంలో విజయ్‌కు సన్నిహితురాలిగా పేరున్న త్రిష పేరు ప్రధానంగా వినిపిస్తోంది. ఆమెను రాజకీయాల్లోకి తీసుకురావాలని పార్టీ యోచిస్తోందా అనే చర్చలు సాగుతున్నాయి. అయితే త్రిష గానీ, ముఖ్యమంత్రి విజయ్ గానీ ఈ ప్రచారంపై స్పందించలేదు. దీంతో ప్రస్తుతం ఇవన్నీ ఊహాగానాలుగానే మిగిలాయి. ఇక సినీ కెరీర్ విషయానికి వస్తే త్రిష వరుస చిత్రాలతో బిజీగా కొనసాగుతోంది. ఇటీవల విడుదలైన 'కరుప్పు' విజయంతో మంచి జోష్‌లో ఉన్న ఆమె, త్వరలో 'విశ్వంభర' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానుంది. అలాగే మరికొన్ని కొత్త చిత్రాలకు కూడా ఆమె గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. నటిగా వరుస విజయాలతో పాటు కొత్త అవకాశాలను అందిపుచ్చుకుంటూ త్రిష తన జోరును కొనసాగిస్తోంది.



# నేడు థియేటర్లలోకి నాగబంధం

## హిందీ వర్షన్‌కు బై వన్ గెట్ 2 ఆఫర్




పౌరాణిక అంశాలు, ఫాంటసీ అడ్వెంచర్, థ్రిల్లింగ్ కథాంశంతో తెరకెక్కిన 'నాగబంధం: ది సీక్రెట్ ట్రెజర్' సినిమా జులై 3న శుక్రవారం ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. దర్శకుడు అభిషేక్ నామా రూపొందించిన ఈ చిత్రంలో విరాట్ కర్ణ, నభా నటేష్, ఐశ్వర్య మీనన్ ప్రధాన పాత్రల్లో నటించారు. విడుదలకు ముందే ఈ సినిమాపై మంచి అంచనాలు ఏర్పడగా, ఇప్పుడు మేకర్స్ మరో ప్రత్యేక నిర్ణయంతో అందరి దృష్టిని ఆకర్షించారు. సినిమా విడుదల రోజునే ప్రేక్షకులను థియేటర్లకు ఆకర్షించేందుకు చిత్ర బృందం 'బై వన్ గెట్ వన్' ఆఫర్‌ను ప్రకటించింది. ఒక టికెట్ కొనుగోలు చేస్తే మరో టికెట్ ఉచితంగా అందించే ఈ స్కీమ్‌ను తొలి రోజు నుంచే అమలు చేస్తున్నారు. ఇటీవల బాలీవుడ్ సినిమాల్లో ఇలాంటి ప్రమోషనల్ ఆఫర్లు ఎక్కువగా కనిపిస్తుండగా, ఇప్పుడు తెలుగు సినిమాల్లో కూడా ఈ తరహా మార్కెటింగ్ వ్యూహాలు చోటుచేసుకోవడం ఆసక్తికరంగా మారింది. అయితే, ఈ ఆఫర్ కేవలం హిందీ వెర్షన్‌కు మాత్రమే వర్తిస్తుందని చిత్ర బృందం స్పష్టం చేసింది. తెలుగు లేదా ఇతర భాషల వెర్షన్లకు ఈ సదు-పాయం ఉండదు. 'నాగబంధం'ను అత్యంత భారీ నిర్మాణ విలువలతో రూపొందించారు. పౌరాణిక కథాంశానికి ఆధునిక విజువల్ ఎఫెక్ట్స్‌ను జోడిస్తూ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించేలా సినిమాను తీర్చిదిద్దినట్లు మేకర్స్ చెబుతున్నారు. ఫాంటసీ ప్రపంచం, యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉండనున్నాయని ప్రచార చిత్రాలు సూచిస్తున్నాయి. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్‌కు సోషల్ మీడియాలో మంచి స్పందన లభించింది. విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, అడ్వెంచర్ అంశాలు సినిమాపై ఆసక్తిని మరింత పెంచాయి. ఈ చిత్రంలో సీనియర్ నటులు జగపతి బాబు, మహేష్ మంజ్రేకర్, మురళీ శర్మ, దక్ష నగర్కర్, రిషభ్ సాహ్నీ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కథలో ప్రతి పాత్రకు ప్రత్యేక ప్రాధాన్యం ఉండేలా దర్శకుడు అభిషేక్ నామా రూపకల్పన చేసినట్లు తెలుస్తోంది. నాగబంధం' సినిమా కాదు... ఓ అనుభవం అన్నారు విరాట్‌కర్ణ. ఆయన కథానాయకుడిగా... అభిషేక్ నామా దర్శకత్వంలో తెరకెక్కిన సినిమానే 'నాగబంధం'. ఓ నటుడిగా అందరి హృదయాల్లో స్థానం సంపాదించాలని ఈ సినిమా కోసం ప్రాణం పెట్టి పనిచేశా. ఇంత పెద్ద సినిమాలో నటించే అవకాశం ఇచ్చిన దర్శకుడికి రుణపడి ఉంటా. ఇందులో ప్రతిదీ ఓ అద్భుతంలా ఉంటుంది. మన భారతీయ సంస్కృతి, వారసత్వానికి జరిగే ఓ వేడుకలాంటి సినిమా ఇది అన్నారు. నిర్మాత డి.సురేశ్‌బాబు మాట్లాడుతూ అందరూ ప్రాణం పెట్టి చేసిన ఖరీదైన సినిమా ఇది. పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నా' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'మన సంస్కృతి, మన మూలాల్ని ఆవిష్కరిస్తూ, సనాతన ధర్మం గురించి గొప్ప సందేశమిస్తుందీ చిత్రం. ప్రేక్షకులకు ఓ ప్రత్యేకమైన అనుభవాన్ని పంచేలా భారీ హంగులతో తెరకెక్కించాం' అన్నారు. నిర్మాతలు మాట్లాడుతూ 'ప్రతి పది నిమిషాలకు ఓ కొత్త ప్రపంచాన్ని తెరపై ఆవిష్కరించే చిత్రమిది. విజువల్ వండర్‌గా అందరి హృదయాల్ని గెలుస్తుంది' అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్రబృందం పాల్గొంది.

# సెన్సార్ నుంచి బటయపడని జననాయగన్



కోలీవుడ్ స్టార్ హీరో దళపతి విజయ్ పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ 'జననాయగన్' రిలీజ్ చుట్టూ ఇండస్ట్రీలో సరికొత్త చర్చ నడుస్తోంది. గత 7 నెలలుగా ఈ చిత్రం సెన్సార్ వివాదాలు, కోర్టు కేసుల కారణంగా వాయిదా పడుతూ వస్తున్న సంగతి తెలిసిందే. అయి-ంతే తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రం సెన్సార్ బోర్డు నుండి 'ఎ సర్టిఫికెట్ పొందే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. వచ్చే వారం రోజుల్లోగా ఈ తుది సర్టిఫికేషన్ పక్రియ పూర్తి కానుందని ఆ వెంటనే హిందీ, తెలుగు వెర్షన్ల సెన్సార్ ఫార్మాలిటీస్‌ను కూడా పూర్తి చేసేందుకు చిత్ర యూనిట్ ఎ÷-లాన్ చేస్తోంది. సెన్సార్ సమస్యలు వీడుతుండటంతో మేకర్స్ ఈ సినిమాను జూలై 16 లేదా జూలై 23న థియేటర్లలోకి తీసుకురావాలని భావిస్తున్నట్లు సమాచారం. అయితే, ఇప్పటికే ఈ విండోలో పలు క్రేజీ చిత్రాలు తమ విడుదల తేదీలను ప్రకటించాయి. జూలై 17న 'అన్బే డయానా', జూలై 23న 'మకుటం', 'ఇమ్మోర్టల్', అలాగే జూలై 31న 'డిసి', 'సిగ్మా' వంటి చిత్రాలు లైన్లో ఉన్నాయి. ఇప్పుడు ఒకవేళ దళపతి విజయ్ రేసులోకి వస్తే ఇప్పటికే ప్రమోషన్లు మొదలుపెట్టిన ఆయా చిత్రాల కలెక్షన్లపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. అయితే సెన్సార్ ఎ సర్టిఫికెట్ ఇస్తే చిన్న పిల్లలు ఈ సినిమా చూసేందుకు అనుమతించరు. తమ హీరో సినిమాను కావాలనే ఇబ్బందులు పెడుతున్నారని ఫ్యాన్స్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కానీ దళపతి చివరి చిత్రం కావడంతో ఈ సినిమా ఎప్పుడు వచ్చినా థియేటర్ల వద్ద జాతర ఖాయమని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# 10న వస్తున్న అఖిల్ లెనిన్

## గ్యాప్ తరవాత విజయం కోసం ఎదురుచూపు



'లెనిన్'తో ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమయ్యారు నటుడు అఖిల్. మురళీకిశోర్ అబ్బూరు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా జులై 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాను మూడేళ్లు విరామం తీసుకోవడానికి గల కారణాన్ని అఖిల్ వివరించారు. ఏజెంట్' సినిమా విడుదలైన మూడు నెలలకు నేను ప్రమాదవశాత్తు బాత్రూంలో పడ్డాను. గాజు ముక్కలు నా చేతికి బలంగా గుచ్చుకున్నాయి. ఎడమ చేతి వేళ్లకు రెండు శస్త్రచికిత్సలు జరిగాయి. 48 కుట్లు పడ్డాయి. 8 నెలల పాటు బరువులు ఎత్తలేకపోయాను. ఆ గాయం నుంచి పూర్తిగా కోలుకోవ డానికి 16 నెలలు పట్టింది. మూడేళ్లు విరామం తీసుకున్నందుకు నా అభిమానులు నాపై కోపంగా ఉన్నారు. ఇలా మరోసారి జరగదని వాళ్లకు నేను హామీ ఇస్తున్నాను అని అఖిల్ చెప్పారు. లెనిన్ చిత్రం గురించి మాట్లాడుతూ.. కథ వినగానే కొత్త అనుభూతి కలిగిందన్నారు. పాత్రల్లోని విభిన్న కోణాలు ఆశ్చర్యపరిచాయని తెలిపారు. ఇలాంటి కథే కాదు.. ఈ అంశంమీద ఒక్క సినిమా కూడా రాలేదని పేర్కొన్నారు. అందుకే ఇలాంటి సినిమాతోనే కమ్‌బ్యాక్ ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు.

Printed, Published and Owned by RAVU RAJITHA, Printed at KAKATHIYA PRINTERS, LN Colony, Uppal IDA, Uppal. Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, RNI NO : TELTEL/2024/86684, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com